


www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

సుఫల అక్షరం
సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక
SUPHALA AKSHARAM

## 2030 నాటికి పేదరిక నిర్మూలన లక్ష్యం

- 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ దిశగా కార్యాచరణ
- టీఎస్‌డీపీఎస్ బలోపేతానికి ప్రత్యేక పీఎంయూ ఏర్పాటు
- జిల్లా అభివృద్ధి ప్రణాళికలకు రూపకల్పన
- ఏడు రంగాల గ్రోత్ ల్యాబ్స్ ఏర్పాటుకు నిర్ణయం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

02



FRIDAY 25TH SEPTEMBER 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 190 COST : 3\- KHAMMAM, TELANGANA

25 శుక్రవారం సెప్టెంబర్ , 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :190 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJ-GIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## రేవంత్‌రెడ్డికి ఆర్యదాన్
# ముహమ్మద్ అవార్డు

- ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్2026' పురస్కారానికి ఎంపిక
- ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు గుర్తింపు
- రైతులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషికి ప్రశంసలు
- కేరళలోని నిలంబూర్‌లో అవార్డు ప్రదానం



02

# సహజ సౌందర్యానికి భంగం కలగకుండా మల్లూరు ఆలయ అభివృద్ధి

- భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు
- ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యం
- ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం
- మాస్టర్ ప్లాన్ అమలుపై అధికారులకు సూచనలు - మంత్రి సీతక్క



02

## సాయుధ దళాల సంక్షేమంపై గవర్నర్ సమీక్ష

- సాయుధ దళాల జెండా దినోత్సవ నిధి రాష్ట్ర నిర్వహణ కమిటీ సమావేశం
- మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమంపై చర్చ
- సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష
- సైనిక కుటుంబాలకు మరింత మద్దతు కల్పించడంపై దృష్టి

హైదరాబాద్, సెప్టెంబర్ 24

అక్షరం న్యూస్:

తెలంగాణ రాష్ట్ర సాయుధ దళాల జెండా దినోత్సవ నిధి (ఆర్మ్డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్) రాష్ట్ర నిర్వహణ కమిటీ ఐదో సమావేశం గురువారం హైదరాబాద్‌లోని లోక్ భవన్ దర్బార్ హాల్‌లో జరిగింది. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సాయుధ దళాల సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి సంబంధించిన అంశాలను సమీక్షించారు.

వివరాలు 2లో



## బీజేపీపై రాహుల్ గాంధీ
# విమర్శలు

- ప్రజా వ్యతిరేకతను దాచేందుకు ప్రయత్నాలు
- రాజ్యాంగ సంస్థల దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణ
- 'ఓట్ చోరీ'కి పాల్పడుతున్నారని ధ్వజం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24అక్షరం న్యూస్:

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. ఎంతటి బలమైన నాయకులైనా కొన్నేళ్లు అధికారంలో కొనసాగిన తర్వాత ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవడం సహజమేనని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ వ్యతిరేకత నుంచి తప్పించుకునేందుకు బీజేపీ వివిధ మార్గాల్లో ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

ప్రజా వ్యతిరేకతపై ప్రశ్నలు

కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలపై ప్రజా వ్యతిరేకత ఎందుకు



వివరాలు 2లో

## కృత్రిమ మేధ, క్లౌడ్ రంగాలకు కొత్త దిశ

- శ్రీధర్ బాబు చేతుల మీదుగా మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్ ప్రారంభం
- హైదరాబాద్‌లో ఇండియా సౌత్ సెంట్రల్ క్లౌడ్ రీజియన్ ఆవిష్కరణ
- 2029 నాటికి 5 గిగావాట్ల డేటా సెంటర్ సామర్థ్య లక్ష్యం
- ప్రపంచ స్థాయి డిజిటల్ మౌలిక వసతుల కేంద్రంగా తెలంగాణ

హైదరాబాద్, సెప్టెంబర్ 24 అక్షరం న్యూస్:

రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం మైక్రోసాఫ్ట్ ఇండియా సౌత్ సెంట్రల్ డేటా సెంటర్ రీజియన్‌ను ప్రారంభించారు. హైదరాబాద్ సాంకేతిక రంగ అభివృద్ధిలో ఇది మరో కీలక ఘట్టమని పేర్కొన్న మంత్రి, క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ రంగాల్లో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత రెండు దశాబ్దాలుగా హైదరాబాద్‌తో అనుబంధం కొనసాగిస్తున్న మైక్రోసాఫ్ట్, ఇప్పుడు నగరాన్ని భవిష్యత్ సాంకేతికతల కేంద్రంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగస్వామిగా మారిందన్నారు.



వివరాలు 2లో

## దిగుమతి సుంకం తగ్గింపుపై తుమ్మల ఆగ్రహం

- రైతుల ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శ - ధరలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని ఆందోళన - కేంద్రం నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 అక్షరం న్యూస్:



ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశీయ ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే అవకాశముందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఒకవైపు దేశంలో ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని రాష్ట్రాలను ప్రోత్సహిస్తూ, మరోవైపు విదేశాల నుంచి దిగుమతి అయ్యే పామాయిల్‌కు అనుకూలంగా విధానాలు అమలు చేయడం వల్ల రైతుల్లో ఆందోళన పెరుగుతోందని అన్నారు.

వివరాలు 2లో

# మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా శారదకు అభినందనలు

**జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ :**

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన నేరెళ్ల శారదను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హార్కార వేణుగోపాల్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.మహిళల సంక్షేమం, భద్రత, సాధికారత కోసం శారద చేస్తున్న సేవలు మరింత విజయవంతంగా కొనసాగాలని వేణుగోపాల్‌రావు ఆకాంక్షించారు. మహిళల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాలని కోరారు. రెండోసారి మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



# 30న రఘునాథపల్లి మండల సర్వసభ్య సమావేశం

**జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)సెప్టెంబరు 24:**

మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 30న బుధవారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారి మురళీధర్ రావు అద్యక్షతన జరుగుతుందని ఎం పిడివో కావ్య తెలిపారు. సమావేశానికి సర్పంచ్ ల తో పాటు వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు




# పాలకుర్తి అభివృద్ధిపై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమీక్ష

**జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ :**

పాలకుర్తి మండల ప్రజా పరిషత్ సమావేశంలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొని మండల అభివృద్ధి, ప్రజా సమస్యలపై సమీక్షించారు. మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమావేశంలో అధికారులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




మొదటిపేజీ తరువాయి

# 2030 నాటికి పేదరిక నిర్మూలన లక్ష్యం

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 అక్షరం న్యూస్:**

తెలంగాణను 2030 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా, 2033 నాటికి దేశంలోనే తొలి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యాచరణకు మరింత వేగం పెంచాలని నిర్ణయించింది. రాష్ట్ర దీర్ఘకాలిక ఆర్థిక, సామాజిక అభివృద్ధి లక్ష్యాల సాధనకు చేపట్టాల్సిన చర్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన గురువారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధి వ్యూహాలు, సంస్థాగత సామర్థ్యాల పెంపు, శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై సమావేశంలో విస్తృత చర్చ జరిగింది.ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆర్థిక, ప్రణాళిక శాఖల ఉన్నతాధికారులతో పాటు ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి, జీఎఫ్ఎస్టీ ఉపాధ్యక్షుడు ఎస్.పీ. టక్కర్ మరియు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, అమలు వ్యవస్థల బలోపేతం, అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలను నిరంతరం పర్యవేక్షించే విధానాలపై చర్చించారు. అభివృద్ధి లక్ష్యాలను వేగంగా సాధించేందుకు డేటా ఆధారిత విధానాలను అనుసరించాలని సమావేశం అభిప్రాయపడింది. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సంఘం సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ యూనిట్ రాష్ట్ర ప్రాధాన్యతా కార్యక్రమాలకు వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించడం, వివిధ శాఖల మధ్య సమన్వయం సాధించడం, అమలు ప్రక్రియలను పర్యవేక్షించడం, పురోగతిని వేగవంతం చేయడం వంటి బాధ్యతలను నిర్వహించనుంది.

# భూగర్భ జలవనరులను పెంచేందుకు కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ : ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి జిల్లా/ ఎల్లారెడ్డి/ సెప్టెంబర్ 24/ అక్షరం న్యూస్:**

భూగర్భ జలాల పెరుగుదలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు.ఎల్లారెడ్డి మండలం మీసన్‌పల్లి గ్రామంలో నిర్మించిన హా ర్వెస్టింగ్ పాండ్‌ను కలెక్టర్ గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా హార్వెస్టింగ్ పాండ్ నిర్మాణం, నీటి నిల్వ సా మర్థ్యం, అక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాలు,పాండ్ విని యోగం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నీటి సంరక్షణకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు.పాండ్ వద్దపనిచేస్తున్న ఉపాధి హామీకూ లీలకు కల్పించిన ఏర్పాట్లపై ఆరా తీశారు.పని ప్రదేశం లో పనిచేసే వారికి అవసరమైన తాగునీరు, ఇతర మౌ లిక సౌకర్యాలు అందు బాటులో ఉండేలాచర్యలు తీసు కోవాలని అధికారులకు సూచించారు.వర్షపు నీటిని స మర్థవంతంగా ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపునకు, వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడేలా హార్వెస్టింగ్ పాండ్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ కు చేపడుతున్న పనులను నాణ్యతా ప్రమాణాలతో, ని ర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికా రులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆర్. ప్ర భాకర్, డీఆర్‌డీఓ దామోదర్, ఎంపీడీవో తహీరా బేగం, తహసీల్దార్ ప్రేమ్ కుమార్, మండల స్పెషల్ ఆఫీసర్ న రసయ్య,





గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ ఏపీవో తదితరు లు అధికారులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# సహజ సౌందర్యానికి భంగం కలగకుండా మల్లూరు ఆలయ అభివృద్ధి

**ములుగు, సెప్టెంబర్ 24 అక్షరం న్యూస్:**

సహజసిద్ధమైన వాతావరణాన్ని పరిరక్షిస్తూ మల్లూరు ఆలయాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. మల్లూరు ఆలయ అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ రూపకల్పన, చేపట్టాల్సిన మౌలిక వసతుల పనులపై జిల్లా కలెక్టర్, దేవాదాయ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రకృతి అందాలను కాపాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, పారిశుద్ధ్యం, విశ్రాంతి కేంద్రాలు, రహదారులు, వాహనాల పార్కింగ్ వంటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర ప్రణాళికతో పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఆలయ ప్రాచీనత, ఆధ్యాత్మిక విశిష్టతకు భంగం కలగకుండా అభివృద్ధి పనులు జరగాలని మంత్రి తెలిపారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ ఆలయ ప్రాంతాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఆలయాన్ని రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ఆలయ అభివృద్ధికి సంబంధించిన వివిధ ప్రతిపాదనలు, చేపట్టాల్సిన పనుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై అధికారులు మంత్రికి వివరాలు అందించారు. ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తుందని మంత్రి తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# గోదావరిఖనిలో గణపతి లడ్డూకు రూ.72,099 ధర

**జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:**

గోదావరిఖని లక్ష్మీనగర్ బొల్ల బజారులో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో లడ్డూ ప్రసాదానికి రూ.72,099 ధర పలికింది. బుధవారం రాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పూజా సామగ్రి వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో గణపతి లడ్డూను న్యూ అలంకృత బ్యూటీ అకాడమీ నిర్వాహకురాలు బూర్ల లలితఅశోక్‌కుమార్ దంపతులు రూ.72,099లకు పాడి దక్కించుకున్నారు. అనంతరం ఉత్సవ సమితి సభ్యులు భారీ లడ్డూను దంపతులకు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా లలితఅశోక్‌కుమార్ దంపతులు మాట్లాడుతూ గణపతి లడ్డూ ప్రసాదాన్ని భగవంతుడి ప్రసాదంగా భావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



మొదటిపేజీ తరువాయి

# రేవంత్‌రెడ్డికి ఆర్యదాన్ ముహమ్మద్ అవార్డు

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 అక్షరం న్యూస్:**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్2026' అవార్డుకు ఎంపికయ్యారు. కేరళకు చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని అందజేస్తోంది. ప్రజా సేవా రంగంలో విశిష్ట కృషి చేసిన వ్యక్తులకు ఈ అవార్డును ప్రదానం చేస్తుంటారు. తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు, అభివృద్ధి లక్ష్యాలతో అమలు చేస్తున్న పథకాలు, దూరదృష్టితో కూడిన నాయకత్వాన్ని గుర్తించి రేవంత్‌రెడ్డిని ఉత్తమ ప్రజా సేవకుడు అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ ఛైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తున్నందుకు ఈ గౌరవం దక్కిందన్నారు.అవార్డు ఎంపిక ప్రక్రియలో ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఎ.పి. అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పేట్టా నారాయణన్ జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు. ప్రజాస్వామిక విలువల పట్ల రేవంత్‌రెడ్డికి ఉన్న నిబద్ధత, ప్రజల సమస్యల పరిష్కారానికి చూపుతున్న చొరవను జ్యూరీ ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు ఫౌండేషన్ వెల్లడించింది. రాష్ట్రంలో వ్యవసాయం, సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమం, సామాజికంగా వెనుకబడిన వర్గాల సాధికారత కోసం తీసుకుంటున్న చర్యలు గుర్తింపు పొందినట్లు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# కృత్రిమ మేధ, క్లౌడ్ రంగాలకు కొత్త దిశ

హైదరాబాద్ ఇప్పటికే దేశంలో ప్రధాన డేటా సెంటర్ గమ్యస్థానంగా ఎదుగుతోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 300 మెగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యం కార్యకలాపాల్లో ఉండగా, మరో 2 గిగావాట్ల సామర్థ్యం అభివృద్ధి దశలో ఉందని వెల్లడించారు. డేటా నిల్వ, క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధ ఆధారిత పరిశ్రమల పెరుగుదలకు అవసరమైన మౌలిక వసతులను ప్రభుత్వం వేగంగా అభివృద్ధి చేస్తోందన్నారు.2029 నాటికి తెలంగాణలో డేటా సెంటర్ సామర్థ్యాన్ని 5 గిగావాట్లకు పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని శ్రీధర్ బాబు తెలిపారు. ఈ రంగంలో విస్తృత పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు డిజిటల్ మౌలిక వసతులు, కృత్రిమ మేధ పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి ద్వారా సుమారు 30 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థలకు తెలంగాణను అత్యంత అనుకూల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కేవలం డేటా సెంటర్ల నిర్మాణమే కాకుండా, మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ఆవిష్కరణలకు అనుకూల వాతావరణాన్ని ఒకే వేదికపైకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. కృత్రిమ మేధ సంస్థలు, స్టార్టప్‌లు, పరిశోధకులు, అంతర్జాతీయ వ్యాపార సంస్థలు హైదరాబాద్ నుంచే తమ కార్యకలాపాలను విస్తరించేలా సమగ్ర పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తున్నామని చెప్పారు.

మొదటిపేజీ తరువాయి

# బీజేపీపై రాహుల్ గాంధీ విమర్శలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 అక్షరం న్యూస్:**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. ఎంతటి బలమైన నాయకులైనా కొన్నేళ్లు అధికారంలో కొనసాగిన తర్వాత ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవడం సహజమేనని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ వ్యతిరేకత నుంచి తప్పించుకునేందుకు బీజేపీ వివిధ మార్గాల్లో ప్రయత్నిస్తోందని ఆరోపించారు.ప్రజా వ్యతిరేకతపై ప్రశ్నలుకొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలపై ప్రజా వ్యతిరేకత ఎందుకు స్పష్టంగా కనిపించడం లేదో అర్థం కావడం లేదని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. రాత్రికి రాత్రే ప్రజా వ్యతిరేకత ఎలా మాయమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబించాల్సిన వ్యవస్థల్లో జోక్యం చేసుకోవడం ద్వారా ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

### రాజ్యాంగ సంస్థలపై ఆరోపణలు

దేశంలోని స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థలను బీజేపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతను కనుమరుగు చేసేందుకు ఈ వ్యవస్థలను ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య సంస్థలు స్వతంత్రంగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

### 'ఓట్ చోరీ'పై ధ్వజం

ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే విధంగా బీజేపీ ప్రభుత్వం 'ఓట్ చోరీ'కి పాల్పడుతోందని రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రజల ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ చేస్తున్న రాజకీయ విమర్శల్లో భాగంగానే రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# సాయుధ దళాల సంక్షేమంపై గవర్నర్ సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 అక్షరం న్యూస్:**

తెలంగాణ రాష్ట్ర సాయుధ దళాల జెండా దినోత్సవ నిధి (ఆర్మ్డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్) రాష్ట్ర నిర్వహణ కమిటీ ఐదో సమావేశం గురువారం హైదరాబాద్‌లోని లోక్ భవన్ దర్బార్ హాల్‌లో జరిగింది. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సాయుధ దళాల సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి సంబంధించిన అంశాలను సమీక్షించారు. సమావేశంలో సాయుధ దళాల జెండా దినోత్సవ నిధి ద్వారా అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు, మాజీ సైనికులకు అందుతున్న సహాయ కార్యక్రమాలపై అధికారులు వివరాలు సమర్పించారు.మాజీ సైనికులు, వారి ఆధారిత కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం చేపడుతున్న చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై సమావేశంలో చర్చ జరిగింది. ఆర్థిక సహాయం, వైద్య సేవలు, విద్యా అవకాశాలు, పునరావాస కార్యక్రమాల అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. సాయుధ దళాల్లో సేవలందించిన వారికి సమాజం తరఫున గౌరవం, భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సంక్షేమ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలయ్యేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో మాజీ సైనికులు, వారి కుటుంబాలకు అందిస్తున్న సేవలను విస్తరించేందుకు అవసరమైన చర్యలపై కూడా చర్చించారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశం ద్వారా సాయుధ దళాల సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత సంస్థలు కట్టుబడి ఉన్నాయనే విషయాన్ని మరోసారి స్పష్టం చేసినట్లు అధికారులు తెలిపారు.

# ఆడబిడ్డల ఆటపాటల మేలుకలయిక.. బొడ్డెమ్మ పండుగ.

- జానపద సంస్కృతికి జీవనాడి.. బొడ్డెమ్మ
- తెలంగాణ పల్లె సంస్కృతి, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా తొమ్మిది రోజుల వేడుక

**సూర్యాపేట, టౌన్ సెప్టెంబర్ 24: అక్షరం న్యూస్**

తెలంగాణ పల్లె సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బొడ్డెమ్మ పండుగ ఆడబిడ్డల ఆటపాటలు, కోలాటాలు, జానపద గేయాలతో వైభవంగా కొనసాగుతుంది. ప్రకృతి ఆరాధనకు ప్రతిరూపంగా నిలిచే ఈ పండుగ బతుకమ్మకు పూర్వరంగంగా భావిస్తారు. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో బొడ్డెమ్మను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. బొడ్డెమ్మను ప్రధానంగా మట్టి, పుట్టమన్ను, చెరువు మట్టితో తయారు చేసి పసుపు, కుంకుమ, బియ్యపు పిండితో అలంకరిస్తారు. పీటపై సోపానాలుగా బొడ్డెమ్మను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించడం ఆనవాయితీ. అనంతరం బాలికలు, ముఖ్యంగా పెళ్లీడుకొచ్చిన కన్యలు బొడ్డెమ్మ చుట్టూ చేరి కోలాటాలు, చప్పట్లు, బృంద నృత్యాలతో పాటలు పాడుతూ సంబరాలు చేసుకుంటారు. "బొడ్డెమ్మా బొడ్డెమ్మా కోల్.. బిడ్డలందరూ కోల్", "బొడ్డెమ్మ బొడ్డెమ్మ ఉయ్యాలో" వంటి జానపద గేయాలు పల్లె వాతావరణాన్ని ఆహ్లాదభరితం చేస్తాయి. పండుగలో భాగంగా నువ్వులు, బెల్లం, పప్పుధాన్యాలతో తయారు చేసిన ప్రసాదాలను పరస్పరం పంచుకోవడం ప్రత్యేకతగా నిలుస్తుంది. బొడ్డెమ్మను ప్రాంతీయ ఆచారాలకు అనుగుణంగా పీటబొడ్డెమ్మ, గుంటబొడ్డెమ్మ, పందిరిబొడ్డెమ్మ, బాయిబొడ్డెమ్మ, సోపానాల బొడ్డెమ్మ వంటి రూపాల్లో తయారు చేస్తారు. రూపాల్లో తేడాలు ఉన్నప్పటికీ పూజా విధానంలో ప్రధానంగా ప్రకృతి ఆరాధన, గౌరమ్మ పూజకు ప్రాధాన్యం ఉంటుంది. వర్షాకాలంలో విరివిగా లభించే రంగురంగుల పూలతో అలంకరణలు చేసి ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే సంప్రదాయం ఈ పండుగలో కనిపిస్తుంది. భూమి, నీరు, ప్రకృతితో తెలంగాణ ప్రజల అనుబంధాన్ని ప్రతిబింబించే పండుగగా బొడ్డెమ్మకు ప్రత్యేక స్థానం ఉంది. బతుకమ్మ పండుగతో కలసి తెలంగాణ సంస్కృతికి ఇది ప్రత్యేక గుర్తింపును అందిస్తోంది.

**బొడ్డెమ్మలో జానపద కళల సందడి**

సాయంత్రం వేళల్లో ఆడబిడ్డలు వలయాకారంలో చేరి పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ, చప్పట్లతో సందడి చేయడం బొడ్డెమ్మ పండుగలో ప్రధాన ఆకర్షణ. చివరగా "నిద్రపో బొడ్డెమ్మా.. నిద్రపోవమ్మా" అంటూ బొడ్డెమ్మను నిద్రపుచ్చే పాటలు పాడి పూజా కార్యక్రమాన్ని ముగిస్తారు. అనంతరం నైవేద్యాలను పరస్పరం పంచుకుని బొడ్డెమ్మను జాగ్రత్తగా ఇంటికి తీసుకెళ్లడం సంప్రదాయంగా వస్తోంది. మహాలయ అమావాస్య సందర్భంగా బొడ్డెమ్మను నీటిలో నిమజ్జనం చేసి సాగనంపుతారు. అనంతరం బతుకమ్మ పండుగకు శ్రీకారం చుట్టడం తెలంగాణ పల్లె సంస్కృతిలో ప్రత్యేకమైన సంప్రదాయంగా కొనసాగుతోంది.



తూపురాణి వేంకటకృష్ణమాచార్యులుతెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సూర్యాపేట

# రామగుండం-2 ఏరియాలో ఘనంగా 55వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీల ముగింపు వేడుకలు

**జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 24 పెద్దపల్లి జిల్లా**

సింగరేణి సంస్థ పరిధిలోని రామగుండం-2 ఏరియాలో నిర్వహించిన లి55వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీల ముగింపు (వ్యాలిడిక్టరీ) వేడుకలులి గురువారం అత్యంత వైభవంగా ముగిశాయి. భూగర్భ గనుల్లో విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు కార్మికుల ప్రాణాలను, గని సంపదను కాపాడే అత్యున్నత నైపుణ్యాలను ప్రదర్శించేందుకు వివిధ ఏరియాల నుంచి వచ్చిన రెస్క్యూ జట్లు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాయి.పోటీల్లో భాగంగా రెస్క్యూ జట్లకు గనుల రెస్క్యూ ఆపరేషన్లు, ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్), అత్యవసర పరికరాల నిర్వహణ, గ్యాస్ టెస్టింగ్, బ్రీతింగ్ ఆపరేటస్ డ్రిల్స్ వంటి అంశాల్లో కఠినమైన పరీక్షలు నిర్వహించారు.

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రముఖులు:**

ముగింపు వేడుకకు డిజీ ఎం ఎస్ , సింగరేణి ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గనుల్లో భద్రతే ప్రథమ ప్రాధాన్యత అని, ప్రమాదాల నివారణతో పాటు అత్యవసర సమయాల్లో రెస్క్యూ టీమ్‌లు ప్రదర్శించే ధైర్యసాహసాలు, వేగవంతమైన ప్రతిస్పందన సింగరేణి సంస్థకు వెన్నెముక వంటివని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో డి జి ఎం ఎస్ డిప్యూటీ డిఎస్ టి.ఆర్. కన్నన్, సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు,డైరెక్టర్లు డా. సాగేష్ కుమార్ ఎం.ఆర్, డా. ఐ. సత్యనారాయణ, అశోక్ కుమార్, కిషోర్ కుమార్ దోకుపర్తి, ఆర్జి టు జనరల్ మేనేజర్ టి. లక్ష్మీపతి గౌడ్, జనరల్ మేనేజర్ (రెస్క్యూ) కె. శ్రీనివాస్ రెడ్డి, జనరల్ మేనేజర్ (ఎస్టివై) కె.జి. తివారీ, ఏఐటీయూసీ ప్రెసిడెంట్ వి. సీతా రామయ్య, ఐ ఎన్ యూసి సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పి. ధర్మపురి తదితరులు పాల్గొన్నారు.ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన రెస్క్యూ జట్లకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ సరికొత్త భద్రతా ప్రమాణాలను అమలు చేయాలని జీఎం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, ఉద్యోగులు, రెస్క్యూ సిబ్బంది, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# వినాయక నిమజ్జన ఏర్పాట్లలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం?

- కంకర చూరాకు బదులు మట్టి పోసి ఏర్పాట్లు..
- భారీ వర్షాలతో బురదమయంగా మారిన నిమజ్జన ప్రాంతం
- భక్తులకు ఇబ్బందులు.. అధికారుల పర్యవేక్షణపై ప్రజల ఆగ్రహం

**కరీంనగర్/జమ్మికుంట/సెప్టెంబర్ 24/అక్షరం న్యూస్:**

వినాయక నిమజ్జన కార్యక్రమం కోసం జమ్మికుంట పట్టణంలో చేపట్టిన ఏర్పాట్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిమజ్జనానికి వచ్చే భక్తులు, వినాయక విగ్రహాల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన ప్రాంతంలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాల్సి ఉండగా, కంకర చూరాకు బదులుగా మట్టి పోసి పనులు చేపట్టడం వల్ల భారీ వర్షాల అనంతరం నిమజ్జన ప్రాంతం బురదమయంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వినాయక నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు, యువత, మహిళలు, చిన్నారులు తరలివచ్చే నేపథ్యంలో రహదారులు, నిమజ్జన ప్రాంతాలను ముందుగానే పటిష్టంగా సిద్ధం చేయాల్సి ఉంది. అయితే సంబంధిత కాంట్రాక్టర్ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వర్షం పడిన వెంటనే మట్టి బురదగా మారి భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు పేర్కొంటున్నారు.వినాయక విగ్రహాలను నిమజ్జన ప్రాంతానికి తరలించే సమయంలో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవడంతో పాటు, భక్తులు బురదలో నడవాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు చెబుతున్నారు.




ముందస్తుగా వర్షాలను దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన కంకర చూరా, అవసరమైన ఇతర సామగ్రితో నిమజ్జన ప్రాంతాన్ని పటిష్టంగా ఏర్పాటు చేసి ఉంటే ఈ ఇబ్బందులు తలెత్తేవి కాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా చేపట్టిన పనుల నాణ్యతపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. కంకర చూరాకు బదులుగా మట్టి ఎందుకు వినియోగించారు? పనుల నాణ్యతను అధికారులు ముందుగా ఎందుకు పరిశీలించలేదు? భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ నిమజ్జన ప్రాంతాన్ని పటిష్టంగా ఎందుకు సిద్ధం చేయలేదనే ప్రశ్నలు పట్టణంలో చర్చనీయాంశంగా మారాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై సంబంధిత అధికారులు సమగ్రంగా సమీక్ష నిర్వహించి, పనుల నాణ్యత, ఏర్పాట్లలో జరిగిన లోపాలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టినట్లు తేలితే బాధ్యులైన కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బ్రేకింగ్ న్యూస్ పెద్ద కొమిర రహదారిపై భారీ వర్షానికి రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్లు.. రాకపోకలకు తీవ్ర అంతరాయం

**ఓదెల పెద్దపల్లి సెప్టెంబర్ 23 అక్షరం న్యూస్**

బుధవారం సాయంత్రం ఉరుములతో విపరీతమైన గాడుపుతో కూడిన భారీ వర్షానికి ఓదెల నుండి పెద్ద కొమిరకు వెళ్లే రహదారిపై భారీ వర్షం కారణంగా రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్లు రోడ్డుపై పడటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు రాత్రివేళల రోడ్డుకు అడ్డంగా చెట్లు పడడంతో అది చూసి ప్రయాణికులు ఎలా వెళ్లాలో అర్థం కాక ప్రయాణికులు అయోమయానికి గురయ్యారు వెంటనే అధికారులు స్థానిక సర్పంచులు సంఘటన స్థలానికి చేరుకొని చెట్లను తొలగించి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసే విధంగా ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై పడిన చెట్లను తొలగించే చర్యలు చేపట్టారు. వీలైనంత త్వరగా రాకపోకలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.



# కూలిన వంతెన పరిశీలన.. పునర్నిర్మాణానికి రూ.5 కోట్లు

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలకు చర్యలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకపల్లి/ సెప్టెంబర్ 24/ అక్షరం న్యూస్:**

మండలం పరిధిలోని రాజుపేట శివారులో కూలిపోయిన వంతెనను గురువారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్ అండ్ బీ డీఈ విశ్వనాథ్, ఎస్సై మధు ప్రసాద్, విద్యుత్ శాఖ ఏఈ నరేష్ కుమార్‌లతో కలిసి ఆయన పరిస్థితిని సమీక్షించి, ప్రత్యామ్నాయ రాకపోకలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పాల్వంచ – దమ్మపేట ప్రధాన రహదారి పూర్తిగా మూసుకుపోవడంతో భారీ వాహనాలను పాల్వంచ నుంచి సత్తుపల్లి మీదుగా మళ్లించారు. కార్లు, ద్విచక్ర వాహనాలు మాదారం, అన్నపురెడ్డిపల్లి, బుగ్గపాడు మీదుగా దమ్మపేటకు.. అదేవిధంగా దమ్మపేట వైపు నుంచి వచ్చే వాహనాలు కంపగూడెం అడ్డరోడ్డు మీదుగా పాల్వంచ వైపు వెళ్లాలని అధికారులు సూచించారు. వంతెన పునర్నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.





# పాల్వంచ - దమ్మపేట రహదారిపై కూలిపోయిన పాములేరు వాగు బ్రిడ్జి

- రాత్రి కురిసిన భారీ వర్షానికి పూర్తిగా దెబ్బతిన్న వంతెన
- స్థంబించిన రాకపోకలు...
- తీవ్ర ఇబ్బందుల్లో ప్రయాణికులు, వాహనదారులు
- నూతన బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని మాజీ జడ్పీటీసీ సున్నం బాబురావు డిమాండ్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ సెప్టెంబర్ 24 /అక్షరం న్యూస్:**

ములకలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రాజుపేట వద్ద పాల్వంచ నుండి దమ్మపేట వెళ్లే ఆర్ అండ్ బీ ప్రధాన రహదారిపై పాములేరు వాగుపై నిర్మించిన బ్రిడ్జి రాత్రి కురిసిన భారీ వర్షానికి కూలిపోయింది.ఈ ప్రమాదం కారణంగా పాల్వంచ - దమ్మపేట మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రవాణాదారులు, ప్రయాణికులు మరియు వాహనదారులు తీవ్ర అంతరాయాన్ని ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో బ్రిడ్జి కూలడంతో ప్రయాణం పూర్తిగా స్తంభించిపోయింది.ఈ నేపథ్యంలో కూలిపోయిన బ్రిడ్జిని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి, మాజీ జడ్పీటీసీ శ్రీ సున్నం బాబురావు స్వయంగా సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్థానిక శాసనసభ్యులు (ఎమ్మెల్యే), సంబంధిత మంత్రులు మరియు ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా యుద్ధ ప్రాతిపదికన నూతన బ్రిడ్జిని నిర్మించాలని, అలాగే ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సోయం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



# కుమ్మరిపాడులో ఘనంగా అన్నదాన కార్యక్రమం

**వినాయక నవరాత్రుల సందర్భంగా పేదలకు భోజన వితరణ**

**హాజరైన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, సిపిఐ నాయకులు**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ సెప్టెంబర్ 24/అక్షరం న్యూస్:**

మండల పరిధిలోని చాపరాలపల్లి గ్రామ పంచాయతీ, కుమ్మరిపాడు గ్రామంలో వినాయక నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అన్నదానం మహాదానం ప్రతి ఆకలికి అన్నం పెట్టడం ద్వారా ఎంతో మానసిక తృప్తి, సమాజానికి మేలు కలుగుతాయని పేర్కొన్నారు. వినాయక నవరాత్రుల వేడుకలలో భాగంగా భక్తిశ్రద్ధలతో పాటు సామాజిక సేవా దృక్పథంతో ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. గ్రామంలోని భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి నరాటి రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి అనుముల సాయి, నాయకులు భాస్కరని అయ్యప్పరాజు తదితరులు పాల్గొన్నారు.



# రాజుపేట వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి

**- కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించిన ఆర్అండ్‌బీ అధికారులు**

**- ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని సీపీఐ డిమాండ్**





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ములకలపల్లి/ సెప్టెంబర్ 24/అక్షరం న్యూస్:**

మండల పరిధిలోని రాజుపేట వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు కొట్టుకుపోయిన వంతెనను ఆర్అండ్‌బీ ఎస్ఈ లాల్‌సింగ్, ఈఈ శంకర్, డీఈ విశ్వనాథం, ప్రకాష్ తదితర అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు, సీపీఐ నాయకులు వంతెన కూలీ రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు పడుతున్న అవస్థలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్ మాట్లాడుతూ..దమ్మపేటములకలపల్లిపాల్వంచ వైపు వెళ్లే వాహనాలకు కంపగూడెంగొల్లగూడెం మీదుగా, అలాగే జగన్నాథపురంకమలాపురంమాదారం వైపు కూడా తక్షణమే ప్రత్యామ్నాయ డైవర్షన్ మార్గాలను ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్డుకిరువైపులా సైడ్ బర్మ్స్, వైండింగ్ పనులకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేసి పనులు చేపట్టాలన్నారు.రూ.10 కోట్లతో ఆధునిక వంతెన నిర్మించాలి: రాజుపేట వద్ద సుమారు రూ.10 కోట్ల వ్యయంతో పెట్రోల్ బంక్ నుంచి గుడి వరకు ఎత్తు పెంచి ఆధునిక ప్రమాణాలతో నూతన హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేశారు. వంతెనకు అడ్డంగా ఉన్న చెట్లు, మొద్దులను వెంటనే తొలగించాలన్నారు. బ్రిడ్జి పైభాగంలో నిర్మించిన చెక్‌డ్యామ్ కారణంగా పునాదుల వద్ద ఇసుక కొట్టుకుపోయి వంతెన ప్రమాదంలో పడే అవకాశం ఉందని, ఉన్నతాధికారులు సాంకేతిక పరిశీలన జరిపి భవిష్యత్తులో ప్రజాధనం దుర్వినియోగం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వర్లు, నాయకులు కొయ్యల అచ్చుతారావు, శనగపాటి రవి, సీతారాములు, పుష్పాల చందర్‌రావు, నరాటి రమేష్, అనుముల సాయి, ఉపసర్పంచ్ పి.లలితారావు, వార్డు సభ్యులు వీరు, లలిత, వెంకటమ్మ, వీరమ్మ, బైరు సాయి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారదకు ఘన సన్మానం

**కరీంనగర్/ఇల్లందకుంట/సెప్టెంబర్ 24/అక్షర న్యూస్:**

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్‌గా రెండోసారి పదవీ బాధ్యతలు స్వీకరించిన నేరెళ్ల శారదను శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని బుద్ధ భవన్‌లో గురువారం ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు నేరెళ్ల శారదను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం తరఫున మెమొంటోతో పాటు ముత్యాల తలంబ్రాలను అందజేశారు. మహిళల హక్కులు, సంక్షేమం కోసం మరింత సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి మేకమల్ల అశోక్, మడిపల్లి గ్రామ సర్పంచ్ మేకమల్ల తిరుమల వెంకటేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గేటి సదానందం తదితరులు పాల్గొన్నారు.



# రెస్క్యూ పోటీలకు డీజీఎంఎస్ ఉన్నతాధికారుల పరిశీలన

**జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

రామగుండం ఏరియా2 పరిధిలో నిర్వహిస్తున్న రెస్క్యూ పోటీలను డీజీఎంఎస్ ఉన్నతాధికారులు గురువారం పరిశీలించారు. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ టి.ఆర్. కన్నన్ ఇల్లందు అతిథి గృహానికి చేరుకోగా, డైరెక్టర్ పి.పి. కె. వెంకటేశ్వర్లు, రామగుండం ఏరియా1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్, ఏరియా2 జనరల్ మేనేజర్ లక్ష్మీపతి గౌడ్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.రెస్క్యూ పోటీల్లో భాగంగా గనుల్లో తలెత్తే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రెస్క్యూ సిబ్బందికి ఉన్న సామర్థ్యం, భద్రతా చర్యలు, విపత్కర పరిస్థితుల్లో వారు ప్రదర్శించే నైపుణ్యాలను అధికారులు పరిశీలించనున్నారు. గనుల భద్రతలో రెస్క్యూ సిబ్బంది పాత్ర, అత్యవసర సమయాల్లో చేపట్టాల్సిన చర్యలను కూడా ఈ సందర్భంగా పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ జోన్ డీఎంఎస్ అశోక్ కుమార్, హైదరాబాద్ రీజియన్2 డీఎంఎస్ డా. సాగేష్ కుమార్ ఎం.ఆర్., హైదరాబాద్ రీజియన్1 డీఎంఎస్ డా. ఐ. సత్యనారాయణ, ఎస్ఓ టు జీఎం కె. చంద్రశేఖర్, ఏజెంట్ చిలుక శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# దినపత్రికలకు అనువైన వార్తా కథనం

**రేపటి కౌన్సిల్ సమావేశంపై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమీక్ష**

**జ్యోతి నగర్ ఎన్టిపిసి, సెప్టెంబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ :**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గురువారం కార్పొరేటర్లతో ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించారు.గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో శుక్రవారం జరగనున్న కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టాల్సిన అభివృద్ధి ప్రతిపాదనలపై కార్పొరేటర్లతో సమగ్రంగా చర్చించారు. నగరంలో మౌలిక వసతుల కల్పన, డివిజన్ల వారీగా నెలకొన్న సమస్యలు, పెండింగ్ పనుల పురోగతిపై కార్పొరేటర్ల నుండి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రామగుండం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కౌన్సిల్ లో చర్చ జరగాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి ముస్తఫా, పలు డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.



# టిబి రహిత గ్రామాలే లక్ష్యం

**ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.**

**జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు**

**కరీంనగర్/జమ్మికుంట/సెప్టెంబర్ 24/అక్షరం న్యూస్:**

టిబి వ్యాధిని పూర్తిస్థాయిలో నియంత్రించి ప్రతి గ్రామాన్ని టిబి రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు అన్నారు.స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాలకు చెందిన పల్లె దవాఖానాల వైద్యాధికారులు, ఏఎన్ఎంలకు టిబి వ్యాధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో టిబి వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని సూచించారు.టిబి సోకే అవకాశం ఎక్కువగా ఉన్న వారిని గుర్తించి వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఎలాంటి జాప్యం లేకుండా చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. టిబి వ్యాధి లక్షణాలు, వ్యాధి నివారణ, చికిత్స విధానం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రతి గ్రామంలో టిబి కేసులను గుర్తించి, బాధితులకు నిరంతర చికిత్స అందిస్తూ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా గ్రామాలను టిబి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దితే గోల్డ్, సిల్వర్ అవార్డులు సాధించే అవకాశం ఉంటుందని, ఇందుకోసం వీలైనన్ని ఎక్కువ గ్రామాలు టిబి రహిత గ్రామాలుగా మారేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రభుదాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ, ఇంపాక్ట్ ఇండియా స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్, మండల కోఆర్డినేటర్లు గీతాంజలి, తిరుపతి, జమ్మికుంట క్లస్టర్ టిబి సూపర్‌వైజర్ దేవేందర్ రెడ్డి, పల్లె దవాఖానాల వైద్యాధికారులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



# నిడిగొండ వినాయకుడి లడ్డు వేలం రూ.1,10,116

**జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)సెప్టెంబరు 24**

: మండలంలోని నిడిగొండ బస్టాండు సమీపంలో శ్రీవరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద బుధవారం రాత్రి వినాయకుడి లడ్డు వేలం పాట నిర్వహించారు. నిడిగొం డ గణేష్ మండపంలో 9 రోజుల పాటు విశేష పూజలందుకున్న వినాయకుడి లడ్డు కోసం నిర్వహించిన వేలం పాటలో నిడిగొండకు చెందిన లింగాల వెంకట రెడ్డి రూ.1.10, 116 (ఒక లక్ష పది వేల నూట పదహారు రూపాయలు)కు లడ్డును దక్కించుకున్నాడు. అనంతరం పూలతో అలంకరించిన వాహనంలో భారీ వినాయక విగ్రహన్ని కమిటీ సభ్యులతో పాటు యువకులు ఉత్సాహంగా బ్యాండు మేళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మ వీరస్వామి, మాసాన్ పల్లి లింగాజీ, జక్కుల కుమార్, కొలిపాక రాజ్ కు మార్, గౌతమ్, శ్రీకాంత్, రాఘవా చారి, శ్రీనివాస్, జగదీష్, నరేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు



# వినాయకుడికి పూజలు నిర్వహించిన రిటైర్డ్ కార్మికులు

**మంచిర్యాల జిల్లా/ మందమర్రి, సెప్టెంబర్ 24/ అక్షర న్యూస్ -:**

మందమర్రి పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుని విగ్రహం వద్ద గురువారం మందమర్రి డివిజన్ లో పని చేసి రిటైర్ అయిన కార్మికులు ఘనంగా పూజలు చేశారు. మందమర్రి డివిజన్ పరిధిలోని గనులలో పనిచేసి రిటైర్ అయిన కార్మికులు కుటుంబ సభ్యులతో పాటు పిల్లాపాపలతో వినాయకుని విగ్రహం వద్దకు చేరుకొని దర్శించుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ కార్మిక అసోసియేషన్ నాయకులు వాసాల శంకర్, నెల్లి వీరన్న, జక్కం రాజన్న, దాసరి ఎల్లారం, ఆర్. వెంకన్న, మేకల కనకయ్య, సూరి, దొంతుల రాజన్న, గోపాల్, పుప్పాల రవి, భీమారి పోషన్న, టీ స్టాల్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

## రేగడి మద్దికుంటలో ఇంజనీరింగ్ విద్యార్థిని అక్షితరాణి కుటుంబానికి పరామర్శ

**జ్యోతి నగర్ ఎన్టిపిసి, సెప్టెంబర్ 24**

**పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ :**

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామంలో దారుణానికి గురైన ఇంజనీరింగ్ విద్యార్థిని అక్షితరాణి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ భరోసా ఇచ్చారు. బుధవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా లతో కలిసి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా మృతురాలు అక్షితరాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున మంజూరైన రూ. 4,12,500 ఆర్థిక సహాయ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. ఈ ఘటన అత్యంత బాధాకరమని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. నిందితులకు చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మహిళలు, పేదలు, దళితులపై ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించేలా ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళలపై వేధింపులు, హింసకు పాల్పడే వారు ఎంతటి వారైనా చట్టం ముందు తప్పించుకోలేరని, పోలీసు శాఖ మరింత అప్రమత్తంగా వ్యవహరించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు



పాల్గొన్నారు.

# వరుసగా మూడోసారి గణపతి లడ్డూ సొంతం

### - రూ.37,516కు వేలంలో దక్కించుకున్న నాగిళ్ల దంపతులు

**హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ సెప్టెంబర్ 24/అక్షరం న్యూస్:-**

మండల కేంద్రంలోని పద్మశాలి కాలనీ-హనుమాన్ల గడ్డ వద్ద శ్రీ గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వినాయక లడ్డూ వేలం పాటలో నాగిళ్ల అరుణ్‌కుమార్‌జయంతి దంపతులు రూ.37,516కు లడ్డూను దక్కించుకున్నారు. భక్తుల మధ్య పోటాపోటీగా సాగిన వేలం పాటలో అత్యధిక ధర పలికి లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు. గత రెండేళ్లుగా లడ్డూను దక్కించుకుంటున్న నాగిళ్ల దంపతులు ఈ ఏడాది కూడా వేలంలో విజయం సాధించడంతో వరుసగా మూడోసారి గణపతి లడ్డూను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు గ్రామ ప్రముఖులు దంపతులను శాలువాలతో సత్కరించి వినాయకుడి ప్రసాదాన్ని అందజేశారు. గణనాథుడి ఆశీస్సులతో వారి కుటుంబం ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో సేవాభావం పెంపొందుతుంది

## జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

**కరీంనగర్/జమ్మికుంట/, సెప్టెంబర్ 24/అక్షరం న్యూస్:**

విద్యార్థులను సామాజిక సేవలో భాగస్వాములుగా తీర్చిదిద్దడంతో పాటు వారిలో వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో జాతీయ సేవా పథకం కీలక పాత్ర పోషిస్తుందని జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మలిచెట్టి కుమార్ అన్నారు. గురువారం కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మలిచెట్టి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు సమాజం పట్ల బాధ్యతను కలిగి ఉండాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనడం ద్వారా వారిలో సేవాభావం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి సుగుణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. జాతీయ సేవా పథకాన్ని 1969 సెప్టెంబర్ 24న మహాత్మాగాంధీ శతజయంతి సందర్భంగా అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ వి.కె.ఆర్.వి. రావు ప్రారంభించారని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రారంభ దశలో దేశంలోని 37 విశ్వవిద్యాలయాల్లో సుమారు 40 వేల మంది విద్యార్థి వాలంటీర్లతో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం ప్రారంభమైందని వివరించారు. అప్పటి నుంచి విద్యార్థుల్లో సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు సమాజ సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఎన్ఎస్ఎస్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. సమాజంలో నెలకొన్న సమస్యలను విద్యార్థులు అర్థం చేసుకుని వాటి పరిష్కారంలో తమ వంతు పాత్ర పోషించాలని ఆయన కోరారు. గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించే పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, అక్షరాస్యత, సామాజిక అవగాహన వంటి వివిధ సేవా కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చురుగ్గా పాల్గొనాలని సూచించారు. సేవా కార్యక్రమాల ద్వారా విద్యార్థులు సమాజంతో మమేకమై ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా




తెలుసుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రామ్ అధికారి కె. తిరుపతి, యూనిట్-2 ప్రోగ్రామ్ అధికారి ఈ. జ్యోత్స్న దేవకి, అధ్యాపకులు జి. ప్రభాకర్, చి. తిరుపతి, శ్రీధర్, ఎన్. ప్రసాద్, డి. మహేష్, ఎండీ ఖలీమ్, ఎండీ దాదే, అమరజ్యోతి, ఎండీ షేఖిల్, కె. ప్రదీప్, లైబ్రేరియన్ బి. ప్రగతి, పి. సీమ, జి. కవిత, జి. శ్రీధర్, ఎస్. శ్రీనివాస్, టి. అనూష, జి. హర్షిణి, ఎన్. శివశంకర్, డి. వీరాస్వామి తదితర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలపై అవగాహన పొందారు.

# హిందీ పక్షోత్సవంలో చిత్రాభివ్యక్తి పోటీ

**జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:**

హిందీ పక్షోత్సవాల్లో భాగంగా ఎన్టీపీసీ మిలియన్ హాల్లో గురువారం చిత్రాభివ్యక్తి పోటీ నిర్వహించారు. చిత్రాన్ని ఆధారంగా చేసుకుని వార్తను రూపొందించే విధంగా ఈ పోటీని నిర్వహించారు. పోటీలో ఉపాధ్యాయులు, పాత్రికేయులు పాల్గొన్నారు. రెండు వేర్వేరు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో సుమారు 20 మంది పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. నిర్ణీత చిత్రాన్ని పరిశీలించి దాని ఆధారంగా వార్తా కథనాన్ని రూపొందించేలా పోటీ సాగింది. ఎన్టీపీసీ హిందీ అధికారి ప్రేమలత ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. హిందీ భాషపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు రచనా, సృజనాత్మక ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా పోటీ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.




# వంతెనపై పొంగిన నీరు.. ఎస్ఐ చొరవతో తొలగిన అడ్డంకులు

**హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ సెప్టెంబర్ 24/అక్షరం న్యూస్:-**

మండలంలోని బొల్లెనిపల్లి వంతెన వద్ద గురువారం ఉదయం నీరు పొంగిపొర్లడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి నెలకొంది. వంతెన వద్ద నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడిన విషయాన్ని గుర్తించిన ముల్కనూర్ ఎస్ఐ ఎం. రాజు వెంటనే స్పందించి వంతెన వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం జేసీబీని రప్పించి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న మట్టి, ఇతర అడ్డంకులను తొలగించేలా చర్యలు చేపట్టారు. దీంతో నీటి ప్రవాహం సజావుగా కొనసాగి రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి. వర్షాల సమయంలో వంతెన వద్ద నీరు నిలిచిపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఎస్ఐ గ్రామ సర్పంచ్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎం. రాజుతో పాటు గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు అక్కడే ఉండి పరిస్థితిని పరిశీలించారు. సమస్యను గుర్తించిన వెంటనే స్పందించి అడ్డంకులను తొలగించడంతో స్థానికులు ఎస్ఐ చొరవను అభినందించారు.



# అశ్వారావుపేటలో వర్షాకాల భద్రతపై పోలీసుల అవగాహన

**భద్రాద్రికొత్తగూడెం /అశ్వారావుపేట/ సెప్టెంబర్24/అక్షరం న్యూస్**



:వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన భద్రతా జాగ్రత్తలు పాటించాలని అశ్వారావుపేట ఎస్ఐ యయాతి రాజు సూచించారు. "ప్రజల భద్రతే మా బాధ్యత" అనే నినాదంతో అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలకు వర్షాకాల భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వర్షాల సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులు వివరించారు.

**విద్యుత్ ప్రమాదాల నివారణ:**

వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు ఎదురైతే స్వయంగా పరిష్కరించేందుకు ప్రయత్నించకుండా సంబంధిత శాఖకు సమాచారం అందించాలన్నారు.

**రహదారి భద్రత:**

నీటితో నిండిన రహదారులపై వాహనాలు నడిపేటప్పుడు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, వేగాన్ని నియంత్రించుకోవాలని సూచించారు.

**శిథిల భవనాలు, చెట్ల పట్ల జాగ్రత్త:**

పాతబడిన, శిథిలావస్థకు చేరిన భవనాల్లో ఉండకుండా అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో చెట్ల కింద నిలబడకూడదని పోలీసులు సూచించారు.

**అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సమాచారం:**

ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా ప్రజలు ఆలస్యం చేయకుండా పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ యయాతి రాజు విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. - పోలీస్ ఎమర్జెన్సీ రెస్పాన్స్: 112 / 100- అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్: 08740-255533- విద్యుత్ శాఖ ఫిర్యాదులు: 1912- అంబులెన్స్ / వైద్య సహాయం: 108- విపత్తు నిర్వహణ కంట్రోల్ రూమ్: 1070 / 1077

# స్థానిక సింగరేణి బిడ్డ దర్శకుడు అద్భుత ప్రదర్శనకు నిదర్శనం ప్యారడైజ్

### - కేసీఆర్ పోలిన పాత్ర ఉండటం అద్భుతం

### - రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్**

జాతి విముక్తి కోసం పోరాడిన ప్రజల పోరాటాన్ని చక్కగా చూపించిన సినిమా ప్యారడైజ్ అని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గురువారం గోదావరిఖనిలో బిఆర్ఎస్ నేతలతో కలిసి పారడైస్ సినిమాని వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. గోదావరిఖని ప్రాంతానికి చెందిన డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల ప్యారడైజ్ మూవీని అద్భుతంగా తీశారని, సినిమా చాలా అద్భుతంగా ఉందని అన్నారు. సినిమాలో చూపించిన జాతి విముక్తి పోరాటాలు ప్రత్యక్షంగా తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో చూసామని, తెలంగాణ ఉద్యమ రోజుల గుర్తుకు వచ్చాయని, సినిమాలో కెసిఆర్ పోలిన పాత్ర చాలా బాగుందని అన్నారు. సినిమాలో పాత్రలు సన్నివేశాలు హీరో నాని జడల నటన చాలా బాగున్నాయని, గోదావరిఖనికి పేరు చేస్తున్న దర్శకుడు శ్రీకాంత్ ఓదెలకు అభినందనలు తెలిపారు.



# చిన్నారిపై లైంగిక దాడి, హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:**

చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడి అనంతరం హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ పెద్దపల్లి పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి స్వప్నరాణి గురువారం తీర్పు వెల్లడించారు. సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2024లో చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం వైశాలి జిల్లా రూప్‌నారాయణ్‌పూర్‌కు చెందిన వినోద్ మాజి (28) కొంతకాలంగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో నివాసం ఉంటున్నాడు. 2024 జూన్ 13న అర్ధరాత్రి సుల్తానాబాద్‌లోని ఓ రైస్ మిల్లులో తల్లిదండ్రులతో కలిసి నిద్రిస్తున్న చిన్నారిని నిందితుడు ఎత్తుకెళ్లి లైంగిక దాడికి పాల్పడి హత్య చేశాడు.ఘటనపై జూన్ 14న మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సుల్తానాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగించి నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొంకెన రవీందర్ బాధితుల తరపున సమర్థవంతంగా వాదనలు వినిపించారు.సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం, ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం నిందితుడు వినోద్ మాజికి జీవిత ఖైదు విధించింది. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన ఏసీపీ కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్, కోర్టు డ్యూటీ అధికారి శ్రీనివాస్, లైజన్ అధికారి కోటేష్‌లను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని సీపీ తెలిపారు.

# చాకలి ఐలమ్మ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలి

- మన రజక సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి జంపయ్య

**హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ సెప్టెంబర్ 24/అక్షరం న్యూస్:-**



తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడి అణగారిన వర్గాల్లో ఆత్మగౌరవ స్ఫూర్తిని నింపిన వీరవనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి ఉత్సవాలను ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని మన రజక సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తంగళ్లపల్లి జంపయ్య పిలుపునిచ్చారు. గురువారం భీమదేవరపల్లిలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాలను నిర్వహించి ఆమె పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.ఆధిపత్య పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని జంపయ్య అన్నారు. ఆనాటి సామాజిక పరిస్థితుల్లో ఎన్నో అణచివేతలను ఎదుర్కొంటూ తన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడంతో పాటు ప్రజల హక్కుల కోసం ఆమె ధైర్యంగా నిలబడ్డారని పేర్కొన్నారు. దొరల పెత్తనాన్ని ఎదిరించి ప్రజల్లో పోరాట స్ఫూర్తిని రగిలించిన చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని తెలిపారు.తెలంగాణ పౌరుషానికి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఐలమ్మ త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆమె జీవిత చరిత్ర, పోరాటం సామాజిక న్యాయం కోసం చేసిన కృషిపై యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో జయంతి సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించడంతో పాటు సభలు, సమావేశాలు నిర్వహించి ఆమె ఆశయాలను ప్రజలకు వివరించాలని కోరారు. చాకలి ఐలమ్మ పోరాటం ఒక వర్గానికే పరిమితం కాదని సామాజిక సమానత్వం ఆత్మగౌరవం కోసం జరిగిన పోరాటానికి ప్రతీకగా నిలిచిందని జంపయ్య అన్నారు. రాష్ట్రంలోని రజక సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# గణపతి ఉత్సవ కమిటీ సభ్యులకు ఘన సన్మానం

- నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించినందుకు షీల్డుల బహూకరణ

**కరీంనగర్/హుజురాబాద్/సెప్టెంబర్ 24/అక్షరం న్యూస్:**

పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించిన గణపతి ఉత్సవ కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. నవరాత్రి ఉత్సవాలు ముగించుకొని గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న సందర్భంగా గణపతి నిమజ్జన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు కమిటీ సభ్యులకు షీల్డులను బహూకరించి అభినందించారు. నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను నిర్వహించడంలో కమిటీ సభ్యులు, నిర్వాహకులు చేసిన కృషిని ఆమె అభినందించారు.గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన, నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ శాఖ, మున్సిపల్ సిబ్బంది, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయడం వల్ల నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగేందుకు అవకాశం ఏర్పడిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జలకుమారి, తహసీల్దార్ నరేందర్, మున్సిపల్ కమిషనర్ కిషన్, పోలీస్ శాఖ అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# అక్టోబర్ 1న జానపద కళాకారుల ఆత్మీయ సమ్మేళనం

- ఖనిలో కళాభవన్ నిర్మించాలి
- తెలంగాణకు జానపద కళా అకాడెమీ, యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి
- కళాకారుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా ఉద్యమిద్దాం
- తారా ఆర్ట్స్ అకాడెమీ అధ్యక్షుడు సంకె రాజేష్, సలహాదారులు కే.స్వామి

**జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

అక్టోబర్ 1న పెద్దపల్లి జిల్లా దేవునిపల్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద కళాకారులమంతా ఆత్మీయంగా కలుసుకుందామని, కళాకారుల సమస్యలపై చర్చిద్దామని తారా ఆర్ట్స్ అకాడెమీ వ్యవస్థాపక అధ్యక్షులు సంకె రాజేష్, అకాడెమీ గౌరవ సలహాదారులు, ఇఫ్టా జాతీయ సమితి సభ్యులు కె.స్వామి పిలుపునిచ్చారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రామగుండం ప్రాంతం కళాకారులకు నిలయంగా ఉందని, తాను కూడా ఈ ప్రాంత బిడ్డగా ఇక్కడి కళాకారులు, శ్రేయోభిలాషుల ప్రోత్సాహంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయి కళాకారుడిగా ఎదగడం జరిగిందని రాజేష్ తెలిపారు. తాను తారా ఆర్ట్స్ అకాడెమీ సంస్థను స్థాపించి కళాకారులను ప్రతి సంవత్సరం ప్రోత్సహిస్తూ పీవీ నరసింహారావు శత జయంతి, 'నల్లవజ్రం' పురస్కారాలతో సన్మానిస్తూ రావడం జరుగుతోందని వెల్లడించారు. ఈ తరుణంలో ఈ ప్రాంత కళాకారులకు అండగా నిలబడాలని కళాకారుల సమస్యలపై చర్చించి, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సహకారంతో సమస్యల పరిష్కారం సాధించడానికి ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమ్మేళనంలో




కళాకారులకు గోదావరిఖనిలో కళాభవన్ సాధించుకోవడం, అలాగే ప్రభుత్వం కళాకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చినా అవి ఫలితం లేకుండా ఉన్నాయని, ప్రభుత్వం గుర్తింపు కార్డుల ద్వారా బస్ పాస్ లను ఇవ్వాలని, టూరిజం ప్లేస్ లో ఉచితంగా సందర్శించేలా పాస్ లను జారీ చేయాలని ప్రభుత్వం దృష్టి తీసుకువెళ్లడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జానపద అకాడెమీ లేదని, వెంటనే ఏర్పాటు చేయాలనీ, జిల్లాకు ఒక కళాభవన్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కళాకారుల సమస్యలపై చర్చించడానికి కళాకారులు అందరూ దేవునిపల్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంకు అక్టోబర్ 1న తరలిరావాలని సంకె రాజేష్, కె.స్వామి కోరారు. ఈ మీడియా సమావేశంలో తారా ఆర్ట్స్ అకాడెమీ బాధ్యులు పెద్దుల శ్రీనివాస్, చల్లా ప్రవీణ్, శేఖర్, స్థానిక సీనియర్ కళాకారులు దామెర శంకర్, మేజిక్ రాజా, చంద్రపాల్, కుమార్ పటేల్, గురుమూర్తి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం2 ఏరియాలో భారీగా మొక్కల నాటకం

**డీజీఎంఎస్, సింగరేణి ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో 500 మొక్కలు నాటిన అధికారులు**







**జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్**

సింగరేణి సంస్థ చేపట్టిన 'గ్రీనింగ్ సింగరేణి' కార్యక్రమంలో భాగంగా రామగుండం2 ఏరియాలోని మెయిన్ మ్యాగజైన్ ప్రాంతంలో గురువారం భారీ మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. డీజీఎంఎస్, సింగరేణి ఉన్నతాధికారులు పాల్గొని మొక్కలు నాటారు.కార్యక్రమానికి డీజీఎంఎస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, దక్షిణ మధ్య ప్రాంతం, హైదరాబాద్ టి.ఆర్. కన్నన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డైరెక్టర్లు సాగేష్ కుమార్ ఎం.ఆర్., ఐ. సత్యనారాయణ, అశోక్ కుమార్‌లతో కలిసి ఆయన మొక్కలు నాటారు. సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టులు, ప్రణాళిక) కొప్పుల వెంకటేశ్వర్లు, రామగుండం2 ఏరియా జనరల్ మేనేజర్ లక్ష్మీపతి గౌడ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. డీజీఎంఎస్, సింగరేణి అధికారుల సహకారంతో మెయిన్ మ్యాగజైన్ సమీపంలో సుమారు 56.25 హెక్టార్ల విస్తీర్ణంలో భారీ మొక్కల పెంపక ప్రాంతాన్ని అభివృద్ధి చేశారు. ప్రస్తుత నాటే సీజన్‌లో ఈ ప్రాంతంలో సుమారు 98 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటికే 60 వేల మొక్కలు నాటినట్లు అధికారులు తెలిపారు. గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సుమారు 500 దేశీయ, స్థానిక జాతుల మొక్కలను నాటారు. మారేడు, చింత, తాని, వేప, తపసి, నేరేడు, మర్రి, రావి, మేడి తదితర మొక్కలను నాటారు. గనుల ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచడంతోపాటు, గనుల ప్రభావానికి గురైన భూములను పర్యావరణపరంగా పునరుద్ధరించడం, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. గనుల భద్రతతోపాటు పర్యావరణ పరిరక్షణ కూడా మైనింగ్ సంస్థల సామాజిక బాధ్యతలో కీలక భాగమని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. కార్యక్రమంలో ఎస్‌వో టు జీఎం రాముడు మాలోత్, డీజీఎం (అటవీ) బానోత్ కర్ణ నాయక్, డీజీఎం (సివిల్) బాలరాజు, పర్సనల్ మేనేజర్ వేణుతోపాటు డీజీఎంఎస్, సింగరేణి అధికారులు, ఉద్యోగులు, అటవీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

# ఇద్దరి కళ్లతో.. నలుగురికి చూపు

- రోడ్డు, రైలు ప్రమాదాల్లో ఇద్దరి మృతి
- దుఃఖంలోనూ నేత్రదానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులు

**జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

ఆప్తులను కోల్పోయిన విషాద సమయంలోనూ మానవత్వాన్ని చాటారు ఆ రెండు కుటుంబాల వారు. తమ వారి నేత్రాలను దానం చేసి నలుగురికి చూపునిచ్చేలా ఆదర్శంగా నిలిచారు. గోదావరిఖని కాకతీయనగర్‌కు చెందిన టెంట్‌హౌస్ నిర్వాహకుడు బొల్లం రామచందర్ (58) గురువారం స్థానిక మాతంగి కాంప్లెక్స్ ఎదుట రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా క్రేన్ వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఈ విషాద సమయంలోనూ ఆయన నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. సదాశయ ఫౌండేషన్, మెదరి సంఘం ప్రతినిధుల సూచన మేరకు అంగీకారం తెలిపారు. జీజీహెచ్‌లో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. అంతర్గాం మండలం బ్రిదిపల్లికి చెందిన ఎన్.లక్ష్మి (55) గురువారం రైలు ఢీకొనడంతో మృతిచెందారు. ఆమె కుటుంబ సభ్యులు కూడా దుఃఖాన్ని దిగమింగుకుని నేత్రదానానికి అంగీకరించారు. టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు.

**విషాదంలోనూ వెలుగులు**

ఆప్తుల మరణంతో పుట్టిన కన్నీటిని.. మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులుగా మార్చారు ఈ రెండు కుటుంబాల సభ్యులు. ఇద్దరి నేత్రాల ద్వారా నలుగురికి చూపు లభించే అవకాశం కల్పించి సమాజానికి స్ఫూర్తిగా నిలిచారు. నేత్రదానం ద్వారా మరణానంతరం కూడా తమ వారి జ్ఞాపకాలను వెలుగులుగా నిలిపారు. ఈ కుటుంబాల నిర్ణయం పలువురికి ఆదర్శమని సదాశయ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ప్రచార కార్యదర్శి వాసు, ప్రతినిధులు లగిశెట్టి చంద్రమౌళి,



భీష్మాచారి, కవిత అనంతరాములు, రాజమౌళి, లక్ష్మీనారాయణ, రాములు, అన్నపూర్ణ, శశికళ, జ్యోతి తదితరులు



పేర్కొన్నారు. నేత్రదాతల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- లోతట్టు ప్రాంతాలపై ఉభయ జిల్లాల కలెక్టర్లు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.
- కలెక్టర్లలు నిరంతరం పర్యవేక్షించాలి
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.



ఖమ్మం జిల్లా / ఖమ్మం టౌన్ / సెప్టెంబర్ 24 / అక్షరం న్యూస్ -: అల్పపీడనం ప్రభావంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం ఉభయ జిల్లాల కలెక్టర్లతో ఫోన్ లో మాట్లాడారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. 24 గంటలూ అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ప్రజలకు తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, చెరువులు, వరద ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ శాశ్వత పరిష్కారానికి సబ్ స్టేషన్ ల మంజూరు

- నియోజకవర్గానికి మరో నాలుగు నూతన సబ్ స్టేషన్లు.
- రూ. 13 కోట్ల 51 లక్షల 59 వేలతో సబ్ స్టేషన్లు.
- రైతులకు సమృద్ధిగా కరెంటు అందించడమే లక్ష్యం.
- రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు.



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / సెప్టెంబర్ 24 / అక్షరం న్యూస్ -: నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో మరో నాలుగు 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. రైతులు, ప్రజలకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా రూ.13.51 కోట్లకు పైగా నిధులతో ఈ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం పెద్దరాజుపల్లిలో రూ.2.44 కోట్లతో, సుల్తానాబాద్ మండల కేంద్రంలోని శాస్త్రినగర్‌లో రూ.2.47 కోట్లతో సబ్‌స్టేషన్లను నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే ఓదెల మండలం రూప్‌నారాయణపేటలో రూ.4.14 కోట్లతో, ఎలిగేడు మండలం ధూళికట్టలో రూ.4.44 కోట్లతో మరో రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా చేయాలనే ఉద్దేశంతో కోట్లాది రూపాయలతో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని విజయరమణారావు తెలిపారు. రానున్న వేసవి నాటికి సబ్‌స్టేషన్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ల నిర్మాణానికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, జిల్లా మంత్రి శ్రీధర్‌బాబుకు విజయరమణారావు కృతజ్ఞతలు తెలిపారు.

## డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లకు చివరి అవకాశం

- ఈనెల 24, 25 తేదీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అ డ్మిషన్లు.
- దోస్త్ తో సంబంధం లేకుండా నేరుగా ప్రవేశాలు.



కామారెడ్డి జిల్లా /ఎల్లారెడ్డి/సెప్టెంబర్ 24/అక్షరం న్యూస్: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి బి ఎ బి ఎస్ సి బీకాం మొదటి సంవత్సరం కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకోవాలనుకునే విద్యార్థులకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రత్యేక అనుమతి ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇ.లక్ష్మీనా రాయణ తెలిపారు. దోస్త్ ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కళాశాలలో హాజరై ప్రవేశం పొందవచ్చన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులుఈ నెల 24, 25 తేదీల్లో ఒరిజినల్ ధ్రువపత్రాలు, జిరాక్స్ కాపీలతో కళా శాలకు రావాలని సూచించారు. ఇంటర్ టీసీ, ఇంటర్ మెమో, ఎస్సెస్సీ మెమో, బోనఫైడ్, ఆదాయ, కుల ధ్రువ పత్రాలు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు వెంట తీసుకురా వాలని తెలిపారు. ఎల్లారెడ్డి పరిసర ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు





- విద్యార్థుల వసతి గృహానికి భూమి పూజ.
- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్

మంచిర్యాల జిల్లా/ మందమర్రి, సెప్టెంబర్ 24/ అక్షరం న్యూస్ -: విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా విద్యార్థుల సౌకర్యార్థం షెడ్యూల్ కులముల సంక్షేమ వసతి గృహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో షెడ్యూల్డ్ కులముల సంక్షేమ వసతి గృహ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, మండల తహసిల్దార్ వనజా రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు, డి.సి.సి. ప్రతినిధి రఘునాథ్, చెన్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తివారి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ షెడ్యూల్ కులముల విద్యార్థుల సంక్షేమం దిశగా 1 కోటి 81 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో వసతి గృహ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, 1 కోటి 50 లక్షల రూపాయలతో జూనియర్ కళాశాలలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. మండలంలోని సోమనపల్లి గ్రామంలో 200 కోట్ల రూపాయలతో 2 వేల 500 మంది విద్యార్థులకు వసతి కల్పించేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ ప్రాంతంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, కోటపల్లి మండలంలో సైతం షెడ్యూల్ కులముల వసతి గృహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెన్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే సంవత్సరం గోదావరి పుష్కరాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 70 కోట్ల రూపాయలతో పుష్కర ఘాట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్, మండల తహసిల్దార్ తో కలిసి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు, విద్యా బోధన, పరిసరాలను పరిశీలించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడి వసతుల కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు బ్యాగులు, బూట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.





# సీసీ కెమెరాల పర్యవేక్షణలో తరగతులు నిర్వహించాలి

- క్లాస్‌రూమ్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే విద్యాబోధనపై పర్యవేక్షణకు అవకాశం



మద్నూర్ / సెప్టెంబర్ 24 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి): మద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు తరగతి గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి పర్యవేక్షణలో క్లాసులు నిర్వహించాలని మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కళాశాలలో సీసీ కెమెరాల వ్యవస్థ ఉన్నప్పటికీ క్లాస్‌రూమ్‌లలో కెమెరాలు లేకపోవడంపై వారు దృష్టి సారించాలని సూచిస్తున్నారు.కళాశాలలో మొత్తం 13 సీసీ కెమెరాలు ఉన్నట్లు సమాచారం. వీటిలో సుమారు 11 కెమెరాలు వారండాల్లో, మరో కెమెరా ఫిజిక్స్ ల్యాబ్‌లో, ఇంకొకటి బయాలజీ ల్యాబ్‌లో ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అయితే ప్రధానంగా విద్యాబోధన జరిగే తరగతి గదుల్లో మాత్రం సీసీ కెమెరాల సౌకర్యం లేకపోవడంతో తరగతుల నిర్వహణపై ప్రత్యక్ష పర్యవేక్షణకు అవకాశం లేకుండా పోతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### క్లాస్‌రూమ్‌లలో కెమెరాలతో కలిగే ప్రయోజనాలు:

తరగతి గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణ, విద్యాబోధన జరుగుతున్న తీరును సంస్థాగతంగా పర్యవేక్షించేందుకు అవకాశం ఉంటుంది. లెక్చరర్లు నిర్ణీత సమయానికి తరగతులకు హాజరవుతున్నారా? పాఠ్యాంశాలను క్రమం తప్పకుండా బోధిస్తున్నారా? విద్యార్థులకు పాఠ్య జ్ఞానం అందుతున్న విధానం ఎలా ఉంది? వంటి అంశాలను కళాశాల యాజమాన్యం సమీక్షించేందుకు ఇది ఒక అదనపు సాధనంగా ఉపయోగపడుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.అదేవిధంగా విద్యార్థులు కూడా తరగతి గదుల్లో క్రమశిక్షణతో వ్యవహరించేందుకు, పాఠాలపై దృష్టి పెట్టేందుకు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉపయోగపడే అవకాశం ఉందని చెబుతున్నారు. తరగతుల్లో ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత విషయాలను సమీక్షించేందుకు కూడా కెమెరా రికార్డింగ్ ఉపయోగపడవచ్చు.

### విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి అవసరం:

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల్లో చాలామంది ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాల కోసం ఇంటర్మీడియట్ విద్యపై ఆధారపడుతున్న నేపథ్యంలో తరగతి గదుల్లో నాణ్యమైన బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ఒక్కటే పరిష్కారం కాదని, వాటితో పాటు నిరంతర పర్యవేక్షణ, లెక్చరర్ల హాజరు, సమయపాలన, పాఠ్య ప్రణాళిక అమలు, విద్యార్థుల సందేహ నివృత్తి, పరీక్షలపై ప్రత్యేక దృష్టి వంటి అంశాలపై కూడా కళాశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు.అదేవిధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే సమయంలో విద్యార్థుల గోప్యతకు సంబంధించిన నిబంధనలు పాటిస్తూ, తరగతి గది భద్రత మరియు విద్యాబోధన పర్యవేక్షణకు మాత్రమే పరిమితం చేసే విధంగా వ్యవస్థను నిర్వహించాలని సూచిస్తున్నారు.

### అధికారుల పర్యవేక్షణతో విద్యాబోధనకు మరింత ప్రాధాన్యం:

మద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న సీసీ కెమెరాల వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగించడంతో పాటు, అవసరమైన తరగతి గదుల్లో నిబంధనలకు అనుగుణంగా కెమెరాల ఏర్పాటు, పర్యవేక్షణ వ్యవస్థను పరిశీలించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తరగతి గదుల్లో పాఠ్యబోధన సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, కళాశాలలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చాలని తల్లిదండ్రులు, విద్యార్థులు, మండల ప్రజలు కోరుతున్నారు.

## ఎస్ఐ మృతి అత్యంత విచారకరం

- బాధితుడి కుటుంబానికి అండగా నిలవాలి.
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / సెప్టెంబర్ 24 / అక్షరం న్యూస్ -: : విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదానికి గురై రామవరం (కొత్తగూడెం టూటౌన్) ఎస్ఐ కునుసోతు వెంకన్న మృతి చెందడం అత్యంత విచారకరమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. గణేష్ నిమజ్జన బందోబస్తు విధుల కోసం హైదరాబాద్ వెళ్లిన ఆయన అక్కడ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. కర్తవ్య నిర్వహణలో అంకితభావంతో పనిచేసే నిబద్ధత కలిగిన అధికారిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తూ, శోకతప్త కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విధి నిర్వహణలో అమరుడైన ఎస్ఐ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, ఆర్థిక సాయంతో పాటు ఆ కుటుంబానికి కొండంత అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.



## పలు వినాయక మండపాలను సందర్శించిన ఎమ్మెల్యే కాంతారావు



మద్నూర్ / సెప్టెంబర్ 24 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

జుక్కల్ నియోజకవర్గంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు నియోజకవర్గంలోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాంతారావు గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయకుడి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సిరిసంపదలు కలగాలని ఆకాంక్షించారు. ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో వినాయక ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు.అనంతరం మద్నూర్ కేంద్రంలోని సర్వజనిక్ గణపతి మండపం వద్ద ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదం అందించి, కార్యక్రమంలో పాల్గొన్న భక్తులతో మమేకమయ్యారు.ఈ సందర్భంగా నిర్వాహకులు, భక్తులు ఎమ్మెల్యే కాంతారావుకు స్వాగతం పలికి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మహా అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.మద్నూర్ గ్రామస్థులు అన్నదాన ప్రసాదం నిర్వహించిన ఎమ్మెల్యే కాంతారావు కు ప్రత్యక ధన్యవాదములు తెలిపారు

## వేలం పాటలో లడ్డు ముప్పై ఒకటి వేలకు దక్కించుకున్న భక్తుడు



మద్నూర్ / సెప్టెంబర్ 24 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

శ్రీ శాంతి గణేష్ మండలి ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా లడ్డూ వేలం పాట నిర్వహించడం జరిగిందని మండలి నిర్వాహకులు తెలిపారు. భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేలం పాట నిర్వహించడం జరిగింది. ఈ వేలం పాటలో గణేషుని భక్తులు హరి లడ్డును ( 31,000) లకు, గడ్డం వార్ దిలీప్ సేపు ( 12,551) రూపాయలకు, గడ్డంవార్ రాజు శాలువా ను ( 5,001) రూపాయలకు భక్తి భావం తో శ్రీ శాంతి గణేష్ మండలి వేలం పాటలో పొందడం జరిగిందని తెలిపారు. వేలం పాటలో లడ్డు, సేపు, శాలువా దక్కించుకున్న వారి కుటుంబ సభ్యులు ఎల్లవేళ దేవుడి యొక్క దైవం ఉండాలని కోరారు.

## డిగ్రీ కళాశాలలో ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



కామారెడ్డి జిల్లా/ ఎల్లారెడ్డి/సెప్టెంబర్ 24/అక్షరం న్యూస్: ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ యూనిట్లు--× ×× ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఈ.లక్ష్మీనారాయణ మా ట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత ఆని, విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనిసూచించారు. అ నంతరం ఎన్ఎస్ఎస్ పీఓ ఎస్. చంద్రకాంత్ మాట్లాడు తూ ప్రతి నాలుగో శనివారం పరిశుభ్రత కార్యక్రమాలు, ఏటా ఏడు రోజుల గ్రామీణ సేవా శిబిరం నిర్వహిస్తున్న ట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీ ర్లు పాల్గొన్నారు.

# భారీ వర్షం.. జలకళ సంతరించుకున్న చెరువులు





హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ సెప్టెంబర్ 24/అక్షరం న్యూస్:-

మండలంలో బుధవారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షంతో చెరువులు, వాగులు, కుంటలు నీటితో నిండిపోయాయి. వరుసగా కురిసిన వర్షాలతో ఆయా జలవనరుల్లోకి భారీగా వరదనీరు చేరడంతో జలకళ సంతరించుకుంది.మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండుకుండలా మారగా.. వాగుల్లో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో రైతులు, స్థానికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వర్షపు నీరు పంట పొలాలకు చేరడంతో సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడు తున్నాయని రైతులు చెబుతున్నారు.భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాగులు, చెరువులు, కుంటల వద్దకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.



# గణేష్ మండపంలో పోలీస్ అధికారుల ప్రత్యేక పూజలు





- **ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించాలి: సీఐ రవికుమార్**

మద్నూర్ / సెప్టెంబర్ 24 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

మద్నూర్ మండలం లచ్చన్ గ్రామంలోని ఫ్రెండ్స్ యూత్ గణేష్ మండపాన్ని బిచ్కుంద సీఐ రవికుమార్, బిచ్కుంద ఎస్ఐ రాజు సందర్శించి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశుడిని దర్శించుకుని ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.గణేష్ మండపానికి పోలీస్ అధికారులు రావడంతో మండలి సభ్యులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సీఐ రవికుమార్, ఎస్ఐ రాజులను మండలి సభ్యులు, గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ.. శుక్రవారం నియోజకవర్గంలో నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మండపాల నిర్వాహకులు, యువత, గ్రామస్తులు పోలీసులకు సహకరించాలని కోరారు.నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు పరస్పరం సహకరించుకుంటూ శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల నిర్వాహకులు ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించి, నిమజ్జన వేడుకలను క్రమశిక్షణతో నిర్వహించాలని సీఐ రవికుమార్ కోరారు.అనంతరం గణనాథుని ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని పోలీస్ అధికారులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ గణేష్ మండలి సభ్యులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# ఎంజీఎంపై బీఆర్ఎస్ నేతల మొసలి కన్నీరు ఆపండి..

- **పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు...?**
- **ఇప్పుడు పగటి వేషగాళ్లలా హడావుడి ఎందుకు--జిల్లా అధ్యక్షుడు అయూబ్.**




వరంగల్ జిల్లా / వరంగల్ టౌన్ / సెప్టెంబర్ 24 / అక్షరం న్యూస్ -:

వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఎంజీఎం ఆస్పత్రి పై మొసలి కన్నీరు కారుస్తూన్న బీఆర్ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు...ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...అధికారం పోయిన తర్వాత పగటి వేషగాళ్ల మాదిరిగా బీఆర్ఎస్ నేతలు ఎంజీఎం ఆస్పత్రిపై చేస్తున్న హడావుడి ప్రజలకు నవ్వు తెప్పిస్తోంది. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎంజీఎం ఆస్పత్రి గురించి పట్టించుకోని నాయకులకు ఇప్పుడు అకస్మాత్తుగా ఎంజీఎంపై ప్రేమ పుట్టుకురావడం విడ్డూరంగా ఉందన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంజీఎం ఆస్పత్రిలో కనీస వసతులు కల్పించేందుకు కూడా సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని అయూబ్ విమర్శించారు. ఎక్స్‌రే లాంటి కనీస సదుపాయాలను కూడా సక్రమంగా అందుబాటులోకి తీసుకురాలేని పరిస్థితి మీ హయాంలో ఉంటే.. ఇప్పుడు ఎంజీఎం గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు ఎక్కడిది? అని ప్రశ్నించారు.నూతన ఆస్పత్రి నిర్మాణం పేరుతో హడావుడి చేయడం తప్ప, దాన్ని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యం కంటే రాజకీయ స్వలాభమే ముఖ్యమా..? ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి వదిలేయడం మీ పాలనలో సాధారణంగా మారిపోయింది మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఎంజీఎం ఆస్పత్రిలో మౌలిక వసతులు, వైద్య సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని అయూబ్ తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇప్పటికే పలుమార్లు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల పురోగతిని మరియు ఎంజీఎం ఆస్పత్రిపై సమీక్షలు నిర్వహించి, సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకురాని ఎంజీఎం ఇప్పుడు ప్రతిరోజూ ఎందుకు గుర్తుకొస్తోంది.? ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారూ అని అన్నారు.మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఎంజీఎం ఘటనను రాజకీయ అంశంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని అయూబ్ విమర్శించారు. పోలీసులు తనపై దాడి చేశారన్న ఆరోపణలపై పూర్తి వాస్తవాలు విచారణలో తేలాల్సి ఉందని, అయితే ఘటనకు సంబంధించిన పూర్తి దృశ్యాలు, ఆధారాలు ప్రజల ముందుంచకుండా రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. పోలీసులు కొట్టారని చెబుతున్నారు.. అయితే ఆ ఆరోపణకు సంబంధించిన పూర్తి ఆధారం ఎక్కడుంది? ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలన్నారు...ఎంజీఎం ఆస్పత్రిలో జరిగిన ఘటనను కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులను పోలీసులు అనుమతించకపోవడంపై జిల్లా అధ్యక్షుడు అయూబ్ స్పందిస్తూ మీడియా ప్రజలకు వాస్తవాలను తెలియజేసే వారధి ఆస్పత్రిలో ఏం జరుగుతుందో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది ఇలాంటి సందర్భాల్లో పారదర్శకత ఉండాలి అని అన్నారు...మీ పార్టీ అధినేతను ఫామ్‌హౌస్‌లో కూర్చోబెట్టి రాజకీయాలు చేయడం ఎందుకు? ఆయనను అసెంబ్లీకి పంపించి ఎంజీఎం సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం వినియోగించుకోవాలి కదా? అని సూటిగా ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రెస్‌మీట్లలో ఆరోపణలు చేయడం కాకుండా చట్టసభల్లో ప్రశ్నించాలని సూచించారు.ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధి కావాలా? లేక ఎంజీఎం పేరుతో రాజకీయ డ్రామాలు కావాలా? ప్రజలే నిర్ణయిస్తారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనను కూడా ప్రజలు చూశారు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పనులను కూడా ప్రజలు చూస్తున్నారు" అని అయూబ్ అన్నారు. చివరగా, ఎంజీఎం ఆస్పత్రి సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించి వరంగల్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మహమ్మద్ అయూబ్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ కమలుద్దీన్, 3వ డివిజన్ అధ్యక్షుడు జన్ను అరుణకర్, 14వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, 43వ డివిజన్ అధ్యక్షుడు మాడుగుల రాజుకుమార్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో ఎస్ఐ మృతి బాధాకరం

- బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి.
- రోడ్డు ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికరం.
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / సెప్టెంబర్ 24 / అక్షరం న్యూస్ –: : విధి నిర్వహణలో భాగంగా రోడ్డు ప్రమాదానికి గురై రామవరం (కొత్తగూడెం టూటౌన్) ఎస్ఐ కునుసోతు వెంకన్న మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన వినాయక నిమజ్జన బందోబస్తు విధులకు హాజరై, కర్తవ్య నిర్వహణలో ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీకొన్న దుర్ఘటనలో ఎస్ఐ వెంకన్న మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రజా రక్షణ కోసం బాధ్యతాయుతంగా సేవలందిస్తూ అకాల మరణం చెందడం పోలీసు శాఖతో పాటు సమాజానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తూ, శోకతప్త హృదయులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అధికారి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, తగిన ఆర్థిక సహాయంతో పాటు ఆ కుటుంబానికి కొండంత అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రమాదానికి కారణమైన వారిపై సమగ్ర దర్యాప్తు జరిపి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే కూనంనేని ఆకాంక్షించారు.

## గ్రామాల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు రచించాలి

- మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచాలి.
- ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర పురోగతి.
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.



భద్రాద్రి కొత్తగూడెం /చుంచుపల్లి / ?సెప్టెంబర్ 24 / అక్షరం న్యూస్–: గ్రామాల సమగ్ర అభివృద్ధికి క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండల పరిధిలోని ఎన్‌కే నగర్ కమ్మ సత్రంలో చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు మండలాల పంచాయతీ సర్పంచులు, సెక్రటరీలు, సిబ్బందికి 'విబి–జి రామ్–జి' పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు మెరుగుపడే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కార్యాచరణ చేపట్టాలని సూచించారు. శ్రమతో కూడిన పనులు చేసే కుటుంబాలకు 125 రోజుల పనిదినాలు కల్పించేలా, 375 రకాల అభివృద్ధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా గ్రామాల్లో నీటి భద్రత, మౌలిక వసతులు, స్థిరమైన జీవనోపాధి కల్పన అనే మూడు అంశాలపై ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అమలు చేసే ప్రతి కార్యక్రమం అర్హులకు చేరేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, వివిధ మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, వివిధ గ్రామాల సర్పంచులు, టెక్నికల్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంగపుత్రుల సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ



కామారెడ్డిజిల్లా/ ఎల్లారెడ్డి/ సెప్టెంబర్ 24/ అక్షరం న్యూస్: ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఐదవ వార్డు కొ త్తపల్లి గ్రామంలో ఐదు లక్షల ఎస్ డిఎఫ్ నిధులతోనిర్మిం చనున్న గంగపుత్రుల సంఘ భవన నిర్మాణానికి గురు వారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మునిసిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ హాజ రై పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. అనం తరం గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్లను ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీన్నా ఎ మ్మెల్యే మదన్మోహన్ దృష్టికి తీసుకెళ్లగా, ఎమ్మెల్యే వెం టనే స్పందించి నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మె ల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ జె జగ్జీవన్, మున్సిపల్ ఏఇ వినోద్, పిఏసిఎ స్ వైస్ చైర్మన్ మత్తమల ప్రశాంత్ గౌడ్, కౌన్సిలర్లు చంద్ర య్య,సయ్యద్ గఫార్, గాదె తిరుపతి,కో ఆప్షన్ సభ్యు డు మొహమ్మద్ అబ్దుల్ వహీద్ తదితరులు గ్రామస్తు లు పాల్గొన్నారు.

# ఆంక్షలు ప్రకటనకేనా.. అమలు ఏదీ..?



- బైండోవర్ చేసినా.. మోగిన డీజేలు
- డీజే శబ్దాలపై పర్యవేక్షణ ఏదీ ?

చిగురు మామిడి/సెప్టెంబర్ 24, అక్షరం న్యూస్,

వినాయక చవితి, నిమజ్జన వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టినా.. డీజే సౌండ్ సిస్టమ్ వినియోగంపై విధించిన ఆంక్షలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలయ్యాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కరీంనగర్ జిల్లా సీపీ గౌస్‌ఆలం ఆదేశాల మేరకు చిగురుమామిడి మండలంలోని 14 మంది డీజే ఆపరేటర్లను ఎస్సై జగదీశ్వర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అయితే నిమజ్జన వేడుకల సందర్భంగా పలు గ్రామాల్లో పరిమితులకు మించి డీజే శబ్దాలు వినిపించడంతో ఆంక్షల అమలుపై చర్చ మొదలైంది. అధిక శబ్దాలతో గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వారు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు స్థానికులు తెలిపారు. ముందస్తుగా డీజే నిర్వాహకులను బైండోవర్ చేసినప్పటికీ.. నిబంధనల అమలును అధికారులు ఎంతవరకు పర్యవేక్షించారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### పర్యవేక్షణ ఏదీ..?

ఆంక్షలు విధించడం, డీజే నిర్వాహకులను బైండోవర్ చేయడంతోనే బాధ్యత ముగిసిపోదని స్థానికులు పేర్కొంటున్నారు. నిమజ్జన ఊరేగింపుల సమయంలో




శబ్ద పరిమితులను పర్యవేక్షించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. ఆంక్షలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# సింగరేణి యాజమాన్యంతో చారిత్రాత్మక ఒప్పందం

- 32 డిమాండ్స్ లో 23 డిమాండ్ లు సాధించాం.
- కార్మికుల హక్కులను కాపాడేది ఏ.ఐ.టి.యూ.సి. నే.
- ఏఐటియూసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య.

మంచిర్యాల జిల్లా/ మందమర్రి సెప్టెంబర్ 24/అక్షరం న్యూస్ –:

మందమర్రి ఏరియాలోని కేకే –5 గని లో ఏ.ఐ.టి.యూ.సి యూనియన్ ఆధ్వర్యంలో గేటు మీటింగు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేజ్ బోర్డు నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య పాల్గొని మాట్లాడారు. గత నెల 27 న హైదరాబాదులో సింగరేణి కార్మికుల సమ్మె నోటీస్ లో ఉన్న డిమాండ్స్ పై హైదరాబాదులో ఆర్ ఎల్ సి సమక్షంలో యాజమాన్యంతో జరిగిన చర్చలలో 32 డిమాండులలో 23 డిమాండ్లు సాధించడం ఒక చరిత్రాత్మకమైన అగ్రిమెంట్ చేసుకోవడం జరిగిందన్నారు. ప్రధానంగా ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న పెర్క్స్ పై ఇన్కంటాక్స్ కోల్ ఇండియా అమలు అవుతున్నప్పటికీ మన సింగరేణిలో అమలుకు నోచుకోక గత ప్రభుత్వ సర్కార్ సంఘం వైఫల్యంతో కాలయాపన చేసిందన్నారు. గత నెల 27 జరిగిన చర్చలలో జరిగిన చారిత్రాత్మక ఒప్పందాన్ని జీర్ణించుకోలేని గతబి.ఆర్.ఎస్ సర్కార్ సంఘం టి.బి.జి.కె.ఎస్ విద్రోహ ఒప్పందం అనడం వారి మూర్ఖత్వానికి తార్కాణమన్నారు. వారు సాధించ లేనిది, ఏఐటియుసి యూనియన్ ఎర్రజెండా సంఘం సాధించిందనీ, లాభాల్లో వాటా కూడా అతి త్వరలో ప్రకటిస్తూ దసరా పండుగ వరకు ఇప్పించనీకి ఒప్పందం కూడా చేసుకోవడం జరిగిందన్నారు. మిగతా డిమాండ్ లు [illegible] రూపకంగా ఇవ్వనీకి ఒప్పందాలు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ ఒప్పందాలను ఒకపక్క కార్మికులు మంచి ఒప్పందం అని హర్షిస్తుంటే కొన్ని సంఘాలు కార్మిక వర్గాన్నీ తప్పు దోవ పట్టించనికి దుష్ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో గెలిచినటువంటి ఈ సర్కార్ సంఘాలు ప్రభుత్వం పైన ఏనాడు ఉద్యమాలు సమ్మెలు చేయకుండా ప్రభుత్వాల వద్ద మోకరిల్లి పైరవీలకు అలవాటు పడి కోట్లు దండుకున్నటువంటి సంఘాలు నేడు ఒక ఎర్రజెండా సంఘం ఏ.ఐ.టి.యూ.సి యూనియన్ ను విమర్శించడం అంటే సూర్యునిపై ఉమ్మి వేస్తే ఎవరి ముఖంపై పడతదో అర్థం చేసుకోవాలన్నారు. దీపావళి బోనస్ గత సంవత్సరం కంటే మెరుగైనదిగా తీసుకువస్తామని అన్నారు. రానున్న రోజుల్లో మన సింగరేణి మీ రక్షించుకుంటూ ప్రభుత్వాల నుండి మనకు రావాల్సినటువంటి 54 వేల కోట్ల రూపాయలు వచ్చేంతవరకు పోరాటాలు చేయాలన్నారు. గత పాలకుల సర్కార్ సంఘాల ఆధ్వర్యంలో ఏ ఒక్క నూతన బొగ్గు గనులు రాలేదన్నారు. నేడు గుర్తింపు సంఘం



యూనియన్ పోరాటాల ఫలితంగా తాడిచెర్ల ఓపెన్ కాస్ట్. మణుగూరు డిప్ సైడు ఓపెన్ కాస్ట్ రావడం జరిగిందన్నారు. టెండర్ ప్రక్రియల ద్వారా శ్రావణపల్లి ఓసి, సత్తుపల్లి ఓసి ఈ రెండు ఓసిలు అతి త్వరలో మన సింగరేణికే దక్కనున్నాయని సీతారామయ్య అన్నారు, ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, భీమనాదుని సుదర్శన్ లు ఏరియాలో జనరల్ మేనేజర్ కార్యాలయంలో జరిగినటువంటి స్ట్రక్చర్ సమావేశాల వివరాలను సాధించిన సమస్యలను కార్మికులకు వివరించారు. ఈ యొక్క మీటింగ్ బ్రాంచ్ జాయింట్ సెక్రెటరీ కంది శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఏరియా నాయకులు సోమిశెట్టి రాజేశం, స్ట్రక్చర్ కమిటీ సభ్యుడు సివి రమణ, కేకే –5 గని నాయకులు ప్రేమ్ లాల్, రాంబాబు, సట్ల కొండయ్య, భగవాన్ రెడ్డి, హేమచందు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ విక్రమ్ సింగ్, జువాజీ శ్రీనివాస్, సివిల్ ఫిట్ కార్యదర్శి కలవల శ్రీనివాస్, సేఫ్టీ కమిటీ, మైన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మందమర్రిలో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు





- సింగరేణి స్థలాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం.
- తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ గడ్డ వివేక్ వెంకటస్వామి.

మంచిర్యాల జిల్లా/ మందమర్రి, సెప్టెంబర్ 24/ అక్షరం న్యూస్ –:

మందమర్రి పట్టణంలో 50 పడకల ఆసుపత్రి నిర్మించేందుకు సింగరేణి యాజమాన్యం అంగీకారం తెలిపిందని తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. గురువారం మందమర్రి పట్టణ మార్కెట్ సెంటర్లో శ్రీశ్రీశ్రీ సింగరేణి వరసిద్ధి వినాయక మండలి వారు ప్రతిష్టించిన భారీ గణనాథుని లడ్డు వేలం పాటలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోఅక్షరాల ఒక లక్ష 16 రూపాయలకు వినాయక లడ్డూని రావికంటి శాలిని కైవసం చేసుకున్నారు. గణపతి మాలను 16 వేల రూపాయలకు ఏడుకోల పవన్ కుమార్ కైవసం చేసుకన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గణనాథుని దయవల్ల ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఈ మందమర్రి ఏరియాకు త్వరలో నూతనంగా కొత్త మైన్ రాబోతుందన్నారు. ఈ ప్రాంతం 1/70 యాక్ట్ లో ఉన్నందువలన ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకొనుటకు ఇంతకుముందు ఇబ్బందులు ఉండేవని ఇప్పుడు అలాంటి ఇబ్బందులు ఏమీ ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా జి.ఎం ఎన్. రాధాకృష్ణ, తహసిల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, డిసిసి ప్రెసిడెంట్ పిన్నింటి రఘునాథరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మంద తిరుమలరెడ్డి, మాజీ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, గుడ్ల రమేష్, ఎస్సీ సెల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మన్, ఉపాధ్యక్షులు ఏడుకోల పవన్ కుమార్, పెద్ద సంఖ్యలో భక్తులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యం

- పారదర్శకంగానే ఇండ్ల ఎంపిక ప్రక్రియ.
- లాటరీ ద్వారా 214 మందికి గృహాలు.
- అణగారిన వర్గాలకు సముచిత ప్రాధాన్యం.
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం.
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు.




భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / సెప్టెంబర్ 24 / అక్షరం న్యూస్ -: : పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 29 డివిజన్లకు, 36 మున్సిపల్ వార్డులకు చెందిన ఇండ్లు లేని నిరుపేదలకు లాటరీ పద్ధతిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించే ప్రక్రియ గురువారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాతకొత్తగూడెంలో జి-2 నిర్మాణ విధానంలో 23 బ్లాకులుగా మొత్తం 828 ఇండ్లు నిర్మాణదశలో ఉన్నాయని, గతంలో కొందరిని లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక జరిగిందని గుర్తుచేశారు. మిగిలిపోయిన 214 మంది అర్హులైన పేదలను ఎలాంటి పక్షపాతం లేకుండా పూర్తి పారదర్శకంగా ప్రజా సమక్షంలో లాటరీ తీసి కేటాయించినట్లు తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశామని, మొత్తం 214 ఇండ్లలో 70 ఇండ్లను ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగులకు ప్రత్యేకంగా కేటాయించామని పేర్కొన్నారు. మిగిలిన 144 ఇండ్లను ఓపెన్ కేటగిరీ కింద పూర్తి నిష్పక్షపాతంగా లబ్ధిదారులకు అందజేశామన్నారు. గూడు లేని నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడమే బాధ్యతగా పనిచేస్తున్నామని, లాటరీలో ఇండ్లు రానివారికి, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి పేద కుటుంబానికి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, ప్రజా ప్రతినిధులు వీరబాబు, కొత్వాల శ్రీనివాసరావు, మండే హన్మంతరావు, లలిత కుమారి, కమిషనర్ సుజాత, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## యువతలో పెరుగుతున్న పక్షవాతం కేసులు.. ముప్పు కలిగించేవి ఏవి?



సాధారణంగా పక్షవాతం (స్ట్రోక్) అనేది వృద్ధాప్యానికి సంబంధించిన సమస్యగా పరిగణిస్తాం. ఇటీవలి పరిశోధనలు ఈ అభిప్రాయాన్ని మారుస్తున్నాయి. గత మూడు దశాబ్దాల్లో 20 నుంచి 54 ఏండ్ల వయస్సు గల వారిలో పక్షవాతం సంభవించే రేటు దాదాపు రెట్టింపయ్యిందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. దీనిపై అమెరికాలో చేపట్టిన అధ్యయన వివరాలు సెప్టెంబర్ 23న న్యూరాలజీ (చీవబతీశీశ్రీశీస్త్రవ) అనే పత్రికలో ప్రచురితమయ్యాయి. ఈ అధ్యయన వివరాలు 1993 నుంచి 2020 మధ్య కాలంలో గ్రేటర్ సిన్సినాటి, ఉత్తర కెంటకీ ప్రాంతాలకు చెందినవి. 20 నుంచి 54 ఏండ్ల వయసు గల వారిలో మొదటిసారి పక్షవాతం వచ్చిన 2076 కేసులను గుర్తించారు. లక్షకు 33.9 కేసులు నమోదవగా, 2020 నాటికి అది 62.2కు చేరింది.

ఇస్కీమిక్ స్ట్రోక్స్ (×ంష్ణవఎఱష స్ట్రోకవం) కేసులే ఎక్కువగా ఉన్నాయి. అంటే మెదడులో ఏర్పడిన బ్లడ్ క్లాట్ లేదా ఇతర ఏదైనా ఇతర ఏదైనా అవరోధం ఒక భాగానికి రక్త ప్రసరణను అడ్డుకోవడం వల్ల ఇది సంభవిస్తుంది. ఈ రకమైన పక్షవాతం ఈ అధ్యయనం కాలంలో లక్షకు 23.8 నుంచి 47.3 కేసులకు పెరిగింది. అయితే పరిశోధకులు ఇంట్రాసెరెబ్రల్ లేదా సబర్నకాయిడ్ హేమరేజెస్ విషయంలో ఇలాంటి పెరుగుదలను గుర్తించలేదు.

యువకుల్లో ఈ పక్షవాతం పెరుగుదలలకు సరైన కారణాన్ని పరిశోధకులు ఇప్పటివరకు గుర్తించలేదు. కానీ పక్షవాతానికి గురైన యువకుల్లో ఎక్కువగా మధుమేహం (ఋఱaఎవ్వం), అట్రియల్ ఫైబ్రిలేషన్, అధిక బీపీ ఉన్నట్లు తేల్చారు. అంతేకాదు మత్తు పదార్థాల వినియోగం వల్ల కూడా ఈ పక్షవాతం సంభవిస్తున్నట్లు గమనించారు. వీటి వినయోగం 1993-94లో 4.6 శాతం నుంచి 2020 నాటికి 40.2 శాతానికి పెరిగింది. దీనిలో అధిక భాగం గంజాయి వాడకం వల్లనే సంభవింయింది. ఈ అధ్యయనం ఒక్క అమెరికాకే కాకుండా ప్రపంచంలోని 204 దేశాలకు కూడా వర్తిస్తుంది. ఎందుకంటే ప్రపంచ వ్యాప్తంగా 1990 నుంచి 2021 మధ్య 15 నుంచి 49 ఏండ్ల సంవత్సరాలు గల వారిలో పక్షవాత కేసులు 36 శాతం పెరిగినట్లు గుర్తించారు. దీనికి అధిక సిస్టోలిక్ బీపీ, అధిక బాడీ మాస్ ఇండెక్స్ (దీవీ×), పెరిగిన ాణూ కొలెస్ట్రాల్, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు వేగంగా పెరగడం, వాయు కాలుష్యం వంటివి కారణాలు అని పరిశోధకులు వెల్లడించారు.

భారతీయుల పరిస్థితి ఏంటి?

అధిక బరువు (జుఇఎవం ఔవఅస్త్రష్ట్), పొగ తాగడం, శారీరక శ్రమ లేకపోవడం, అధిక బీపీ, అధికంగా మద్య తాగడం, ఆహార అలవాట్లలో మార్పు, అధిక కొలెస్ట్రాల్ ఇవన్నీ పక్షవాతం రావడానికి కారకాలు అని అధ్యయనాలు చెబుతున్నాయి. కానీ ఇవే ప్రధాన కారణమని యూఎస్ చేపట్టిన కొత్త పరిశోధన నిరూపించలేదు. అయినప్పటికీ వీటిలో చాలా వాటిని మనం మార్చుకుంటే మంచిదని పరిశోధకులు చెబుతున్నారు. పక్షవాతానికి ప్రధాన కారణం అధిక రక్తపోటు (ఎఅస్త్రష్ట దీూ) అని గుర్తించారు.

అధ్యయనాలు ఏం చెబుతున్నాయి?


అధ్యయనాల ఫలితాలు ఎలా ఉన్నప్పటికీ వయసుతో సంబంధం లేకుండా వచ్చే అకస్మాత్తుగా వచ్చే నాడీ సంబంధిత (చీవబతీశీశ్రీశీస్త్రఱషaశ్రీ) వ్యాధులను నిర్లక్ష్యం చేయకూడదు. అకస్మాత్తుగా వచ్చే నీరసం లేదా తిమ్మిరి, శరీరంలోని ఒకవైపునకు ముఖం వాలిపోవడం, వదలని తలనొప్పి, మాట్లాడటంలో ఇబ్బంది, అకస్మాత్తుగా దృష్టిలోపాలు, తల తిరగడం వంటి పక్షవాతానికి సంకేతాలు కావచ్చు. కాబట్టి వీటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

### వేడిగా ఉన్న వాతావరణంలో ఎక్కువ సేపు

## ఉంటే కనిపించే లక్షణాలు ఇవే.. ఏం చేయాలంటే..?

వేడి వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతలకు ఎక్కువసేపు గురికావడం వల్ల శరీర ఉష్ణోగ్రత ప్రమాదకర స్థాయికి పెరిగి వడదెబ్బకు దారితీస్తుంది. అయితే వడదెబ్బ తీవ్రమయ్యే ముందే శరీరంలోని జీర్ణవ్యవస్థపై వేడి ప్రభావం చూపే అవకాశం ఉంది. అధిక వేడి కారణంగా శరీరాన్ని చల్లబరచేందుకు చర్మం వైపు రక్తప్రసరణ ఎక్కువగా మళుతుంది. దీంతో పొట్ట, పేగులకు చేరే రక్తప్రసరణ తగ్గి జీర్ణక్రియపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితిని కొన్నిసార్లు థర్మల్ లీక్ గా పేర్కొంటారు. ఇది అధికారిక వైద్య నిర్ధారణ కాదు. తీవ్రమైన వేడి వల్ల పేగుల రక్షణ పొర దెబ్బతిని వాటి పనితీరులో మార్పులు వచ్చే పరిస్థితిని వివరించేందుకు ఈ పదాన్ని ఉపయోగిస్తారు. అధిక వేడి కారణంగా జీర్ణక్రియ మందగించడంతోపాటు పొట్ట, పేగుల అంతర్గత పొరపై కూడా ప్రభావం పడుతుంది. పేగుల రక్షణ వ్యవస్థ బలహీనపడడం వల్ల జీర్ణవ్యవస్థలో అసౌకర్యం, వాపు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. వడదెబ్బకు ముందే ఆకలి తగ్గడం, వికారం, కడుపులో మంట లేదా నొప్పి, పొట్ట ఉబ్బరం, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన వేడి సమయంలో ఇలాంటి జీర్ణ సంబంధిత మార్పులను నిర్లక్ష్యం చేయకుండా శరీరంలో వేడి ఒత్తిడికి సంబంధించిన సంకేతాలుగా గుర్తించడం అవసరం.

**నీరు, లవణాలు బయటకు..**



వేడి వాతావరణంలో చెమట ద్వారా శరీరం నుంచి పెద్ద మొత్తంలో నీరు, లవణాలు బయటకు వెళ్లడం వల్ల నిర్జలీకరణం ఏర్పడుతుంది. దీంతో జీర్ణవ్యవస్థ పనితీరు మరింత ప్రభావితమవుతుంది. శరీరంలోని ఎలక్ట్రోలైట్ల సమతుల్యత దెబ్బతినడం కూడా పేగుల పనితీరుపై ఒత్తిడిని పెంచుతుంది. తీవ్రమైన వేడి వల్ల పేగుల రక్షణ పొర మరింత దెబ్బ తినే అవకాశం ఉండడంతో వాపు వంటి ప్రతిచర్యలు కూడా ఏర్పడతాయి. బయట ఎక్కువసేపు పనిచేసే వారు, క్రీడాకారులు, వృద్ధులు, దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడేవారు, వేడి తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో పిల్లలు ఈ ప్రభావాలకు ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంది.

**ద్రవాలను అధికంగా తీసుకోవాలి..**

వేడి వాతావరణంలో జీర్ణవ్యవస్థను కాపాడుకోవాలంటే తగినంత నీరు తాగుతూ శరీరంలో ద్రవాల లోటు రాకుండా చూసుకోవాలి. అవసరమైన సందర్భాల్లో ఎలక్ట్రోలైట్లను భర్తీ చేయాలి. తీవ్రమైన వేడి సమయంలో అధికంగా, భారంగా ఉండే ఆహారాన్ని తగ్గించి, నీరు ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను తీసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. మద్యం తీసుకోవడాన్ని పరిమితం చేయడం కూడా అవసరం. నిరంతర వాంతులు, తీవ్రమైన నిర్జలీకరణం, గందరగోళం, శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తే పరిస్థితి అత్యవసరంగా మారే అవకాశం ఉన్నందున వెంటనే వైద్య సహాయం పొందాలి.

### గుండె ఆరోగ్యంగా ఉండేందుకు రన్నింగ్

## వర్సెస్ బాడీవెయిట్ స్క్వాట్స్.. ఏవి ఉత్తమం..?

వ్యాయామం ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమైనది. అయితే గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ఏ వ్యాయామం ఎక్కువగా ఉపయోగపడుతుందనే సందేహం చాలామందికి ఉంటుంది. ముఖ్యంగా బాడీవెయిట్ స్క్వాట్స్, రన్నింగ్ రెండూ శరీరానికి మేలు చేసినప్పటికీ, వాటి ప్రయోజనాలు భిన్నంగా ఉంటాయి. రన్నింగ్ ప్రధానంగా ఏరోబిక్ వ్యాయామం కాగా, స్క్వాట్స్ కండరాల బలాన్ని పెంచే వ్యాయామంగా పనిచేస్తాయి. అందువల్ల గుండె ఆరోగ్యం కోసం ఈ రెండింటిలో ఏది ఎంచుకోవాలనేది వ్యక్తి వయసు, శారీరక సామర్థ్యం, ఆరోగ్య పరిస్థితి, వ్యాయామాన్ని తట్టుకునే సామర్థ్యంపై ఆధారపడి ఉంటాయి.

**రన్నింగ్ చేస్తే..**

రన్నింగ్ చేసే సమయంలో గుండె వేగం కొంతసేపు పెరిగి ఉంటుంది. గుండె, ఊపిరితిత్తులు పనిచేసే కండరాలకు నిరంతరం ఆక్సిజన్ అందించాల్సి రావడంతో కార్డియో సామర్థ్యం, శ్వాసకోశ సామర్థ్యం మెరుగుపడతాయి. క్రమం తప్పకుండా మితమైన స్థాయిలో రన్నింగ్ చేయడం రక్తపోటును నియంత్రించడంలో, ఆరోగ్యకరమైన శరీర బరువును కొనసాగించడంలో కూడా సహాయపడుతుంది. అయితే చాలాకాలంగా వ్యాయామం చేయని వారు ఒక్కసారిగా తీవ్రంగా పరుగెత్తడం కంటే ముందుగా నడక, వేగంగా నడక వంటి తక్కువ తీవ్రత కలిగిన వ్యాయామాలతో ప్రారంభించి క్రమంగా పరుగుకు వెళ్లడం మంచిది.

**బాడీవెయిట్ స్క్వాట్స్ అయితే..**




వ ు ంో వ్ౖ వ్ు బాడీవెయిట్ స్క్వాట్స్ ప్రధానంగా కాళ్లు, తొడలు, నడుము, పొ త్తి క్ డ్ ు వ్ు కండరాలను బలోపేతం చేస్తాయి. కూర్చోవడం, నిలబడడం, మెట్లు ఎక్కడం, నడవడం వంటి రోజువారీ పనులను సులభంగా చేయడానికి అవసరమైన శారీరక సామర్థ్యాన్ని ఇవి పెంచుతాయి. స్క్వాట్స్‌ను వరుసగా లేదా వేగంగా చేస్తే గుండె వేగం కూడా పెరుగుతుంది. అయినప్పటికీ వాటిని రన్నింగ్‌కు సమానమైన ఏరోబిక్ వ్యాయామంగా పరిగణించలేం. కండరాల బలం, కండరాల సహనశక్తిని పెంచడం స్క్వాట్స్ ప్రధాన ప్రయోజనం కాగా, రన్నింగ్ నిరంతర కార్డియో వ్యాయామాన్ని అందిస్తుంది.

**ఏది ఉత్తమం..**


అందువల్ల గుండె ఆరోగ్యం కోసం రన్నింగ్, స్క్వాట్స్‌లో ఒక్కదానినే ఎంచుకోవాల్సిన అవసరం లేదు. కార్డియో సామర్థ్యాన్ని పెంచుకోవాలనుకునేవారు నడక, జాగింగ్ లేదా రన్నింగ్‌ను చేయడంతో పాటు కండరాల బలం కోసం స్క్వాట్స్ వంటి వ్యాయామాలను కూడా చేర్చుకోవచ్చు. వ్యాయామాన్ని కొత్తగా ప్రారంభించేవారు ముందుగా సరైన పద్ధతిలో బాడీవెయిట్ స్క్వాట్స్ నేర్చుకుని, రన్నింగ్‌ను కూడా క్రమంగా పెంచుకోవాలి. ఛాతిలో నొప్పి, కారణం తెలియని శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తల తిరగడం వంటి లక్షణాలు వ్యాయామ సమయంలో కనిపిస్తే వెంటనే వైద్యుడి సలహా తీసుకోవాలి.

## ‘ఆ రోజు నాకు రెండో జీవితం దక్కింది’..

- **ఐదేళ్ల క్రితం ప్రమాదాన్ని గుర్తుచేసుకున్న సాయి దుర్గా తేజ్**

మెగా హీరో సాయి దుర్గా తేజ్ జీవితంలో 2021 సెప్టెంబర్ నెలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆ నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన.. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండి చికిత్స తీసుకున్నారు. ప్రమాదం నుంచి క్రమంగా కోలుకుని మళ్లీ సినిమాల్లోకి వచ్చారు. ఇప్పుడు ఆ ప్రమాదం జరిగి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా సాయి దుర్గా తేజ్ చేసిన భావోద్వేగ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఐదేళ్ల క్రితం ఇదే రోజున తనకు జీవితంలో రెండో అవకాశం లభించిందని సాయి దుర్గా తేజ్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు అందించిన అండ తన కోలుకునే ప్రయాణంలో ఎంతో కీలకంగా నిలిచిందని చెప్పారు. వారి ప్రేమ, ప్రార్థనలు, సందేశాలు తనకు కష్టమైన రోజుల్లో ముందుకు సాగేందుకు బలాన్ని ఇచ్చాయని గుర్తుచేసుకున్నారు.

ప్రమాదంలో ఎదురైన గాయాల నుంచి తాను దాదాపు 90 శాతం వరకు కోలుకున్నానని సాయి దుర్గా తేజ్ తెలిపారు. అయితే మాటతీరు సహా కొన్ని విషయాల్లో ఇంకా పూర్తిగా మెరుగుపడేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. ప్రతిరోజూ ఒక్కో అడుగు ముందుకు వేస్తూ కోలుకుంటున్నానని పేర్కొన్నారు. కష్టమైన ప్రతి రోజు, ఎదురుదెబ్బ తగిలిన ప్రతి సందర్భం, వదిలేయడం సులభంగా అనిపించిన ప్రతి



క్షణంలోనూ మీ ప్రేమే నాకు బలాన్ని ఇచ్చింది. ఐదేళ్ల తర్వాత కూడా నేను నిలబడి ఉన్నాను. పోరాడుతున్నాను. జీవిస్తున్నాను అనే భావాన్ని ఆయన తన పోస్ట్‌లో వ్యక్తం చేశారు. తన కోసం ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ, పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పినవారికి, ప్రతి సందేశం ద్వారా ప్రేమను పంచుకున్నవారికి సాయి దుర్గా తేజ్ కృతజ్ఞతలు తెలిపారు. తాను ఈ స్థాయిలో ఉండటానికి అభిమానుల ప్రేమ కూడా ఒక ముఖ్యమైన కారణమని చెప్పారు. తన ప్రమాదం నుంచి అందరూ ఒక విషయాన్ని నేర్చుకోవాలని సాయి దుర్గా తేజ్ సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. హెల్మెట్ ధరించడం చిన్న నిర్ణయంలా కనిపించినా.. ప్రాణాలను కాపాడటంలో అది ఎంతో కీలకమని తన అనుభవం ద్వారా చెప్పారు. ప్రమాదం తర్వాత సాయి దుర్గా తేజ్ మళ్లీ సినిమాల్లోకి రావడం కూడా అభిమానుల్లో ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగించింది. ఇప్పుడు ఆయన వరుసగా సినిమాలు చేస్తూ తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. ఇక సాయి దుర్గా తేజ్ నటిస్తున్న తాజా చిత్రం ‘సంబరాల ఏటిగట్టు’. రోహిత్ కేపీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. జగపతి బాబు, ఐశ్వర్య లక్ష్మి, శ్రీకాంత్, సాయి కుమార్, అనన్య నాగళ్ల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. బాలీవుడ్‌కు చెందిన ఓ ప్రముఖ నటుడు కూడా ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెట్రివేల్ పళనిస్వామి ఛాయాగ్రహణం అందిస్తుండగా.. బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. భారీ యాక్షన్ అంశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 12న పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

# 'ఆ రోజు నాకు రెండో జీవితం దక్కింది'..

## ఐదేళ్ల క్రితం ప్రమాదాన్ని గుర్తుచేసుకున్న సాయి దుర్గా తేజ్



మెగా హీరో సాయి దుర్గా తేజ్ జీవితంలో 2021 సెప్టెంబర్ నెలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆ నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన.. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండి చికిత్స తీసుకున్నారు. ప్రమాదం నుంచి క్రమంగా కోలుకుని మళ్లీ సినిమాల్లోకి వచ్చారు. ఇప్పుడు ఆ ప్రమాదం జరిగి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా సాయి దుర్గా తేజ్ చేసిన భావోద్వేగ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఐదేళ్ల క్రితం ఇదే రోజున తనకు జీవితంలో రెండో అవకాశం లభించిందని సాయి దుర్గా తేజ్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు అందించిన అండ తన కోలుకునే ప్రయాణంలో ఎంతో కీలకంగా నిలిచిందని చెప్పారు. వారి ప్రేమ, ప్రార్థనలు, సందేశాలు తనకు కష్టమైన రోజుల్లో ముందుకు సాగేందుకు బలాన్ని ఇచ్చాయని గుర్తుచేసుకున్నారు.

ప్రమాదంలో ఎదురైన గాయాల నుంచి తాను దాదాపు 90 శాతం వరకు కోలుకున్నానని సాయి దుర్గా తేజ్ తెలిపారు. అయితే మాటతీరు సహా కొన్ని విషయాల్లో ఇంకా పూర్తిగా మెరుగుపడేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. ప్రతిరోజూ ఒక్కో అడుగు ముందుకు వేస్తూ కోలుకుంటున్నానని పేర్కొన్నారు. కష్టమైన ప్రతి రోజు, ఎదురుదెబ్బ తగిలిన ప్రతి సందర్భం, వదిలేయడం సులభంగా అనిపించిన ప్రతి క్షణంలోనూ మీ ప్రేమే నాకు బలాన్ని ఇచ్చింది. ఐదేళ్ల తర్వాత కూడా నేను నిలబడి ఉన్నాను. పోరాడుతున్నాను. జీవిస్తున్నాను అనే భావాన్ని ఆయన తన పోస్ట్‌లో వ్యక్తం చేశారు. తన కోసం ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ, పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పినవారికి, ప్రతి సందేశం ద్వారా ప్రేమను పంచుకున్నవారికి సాయి దుర్గా తేజ్ కృతజ్ఞతలు తెలిపారు. తాను ఈ స్థాయిలో ఉండటానికి అభిమానుల ప్రేమ కూడా ఒక ముఖ్యమైన కారణమని చెప్పారు.

తన ప్రమాదం నుంచి అందరూ ఒక విషయాన్ని నేర్చుకోవాలని సాయి దుర్గా తేజ్ సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. హెల్మెట్ ధరించడం చిన్న నిర్ణయంలా కనిపించినా.. ప్రాణాలను కాపాడటంలో అది ఎంతో కీలకమని తన అనుభవం ద్వారా చెప్పారు.ప్రమాదం తర్వాత సాయి దుర్గా తేజ్ మళ్లీ సినిమాల్లోకి రావడం కూడా అభిమానుల్లో ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగించింది. ఇప్పుడు ఆయన వరుసగా సినిమాలు చేస్తూ తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. ఇక సాయి దుర్గా తేజ్ నటిస్తున్న తాజా చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్ కేపీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. జగపతి బాబు, ఐశ్వర్య లక్ష్మి, శ్రీకాంత్, సాయి కుమార్, అనన్య నాగళ్ల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. బాలీవుడ్‌కు చెందిన ఓ ప్రముఖ నటుడు కూడా ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెట్రివేల్ పళనిస్వామి ఛాయాగ్రహణం అందిస్తుండగా.. బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. భారీ యాక్షన్ అంశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 12న పాన్ ఇండియా స్థాయి లో విడుదల చేయాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

# జడల్‌తో నాని బ్లాక్‌బస్టర్ కొట్టాడా?

నాని, శ్రీకాంత్ ఓదెల కలిసి చేసిన 'దసరా' సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. అదే కాంబినేషన్‌లో 'ది ప్యారడైజ్' ప్రకటనతోనే ఆసక్తిని పెంచింది. గ్లింప్స్, టీజర్, 'ఆయా షేర్', 'ఏష నాగుల కట్ట'.. ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ట్రైలర్ లేకుండానే సినిమాను రిలీజ్ చేసినప్పటికీ బజ్ విషయంలో ఎక్కడా డోకా లేదు. మరి ఇంత భారీ అంచనాలతో వచ్చిన ఈ సినిమా అంచనాలను అందుకుందా? అసలు 'ది ప్యారడైజ్' కథ ఏమిటి? గుర్తింపు కోసం సవారీ జాతి చేసిన పోరాటం ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని కలిగించింది? రివ్యూలో చూద్దాం.




### కథ

హైదరాబాద్ కు ఆనుకుని ఉన్న ప్యారడైజ్‌లో సవారీ జాతి ప్రజలు నివసిస్తుంటారు. ఆ జాతికి ఒక చరిత్ర ఉంది. స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా ఆ జాతి వారు పాల్గొన్నారు. కాకపోతే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సవారీ జాతికి ఎలాంటి గుర్తింపు లభించలేదు. వారు జనాభా లెక్కల్లో లేరు. ఓటు హక్కు లేదు. ఈ దేశానికి సంబంధించిన ఎలాంటి రక్షణ వారికి లేదు. అసలు వాళ్ల ఉనికినే ఎవరూ పట్టించుకోని పరిస్థితి. దీనికి కారణం శికంజ్ మాలిక్ (మోహన్ బాబు). సవారీ జాతి ప్రజలు తమకు గుర్తింపు కావాలని ఎంత మొరపెట్టుకున్నా.. ఆ జాతికి గుర్తింపు రాకుండా శికంజ్ అడ్డుకుంటుంటాడు. సవారీ జాతిపై శికంజ్ పగ ఏమిటి? సవారీ జాతిలో పుట్టిన జడల్ (నాని) ఆ జాతి కోసం ఎలాంటి పోరాటం చేశాడు? చివరికి ఆ జాతికి గుర్తింపు వచ్చిందా లేదా? అనేది మిగతా కథ.

### విశ్లేషణ

'ది ప్యారడైజ్' ఒక రెవల్యూషనరీ యాక్షన్ డ్రామా. తమ ఉనికి కోసం సవారీ జాతి ప్రజలు చేసిన పోరాటమే ఈ కథ. ఈ కథను దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మదర్ సెంటిమెంట్, యాక్షన్ ప్రధానంగా నడిపించాడు. సవారీ జాతి ప్రజల ప్రపంచాన్ని, వారి చరిత్రను పరిచయం చేస్తూ కథ మొదలవుతుంది. సమ్మక్క (సోనాలి కులకర్ణి) ఓ బిడ్డకు జన్మనివ్వడం, సవారీ జాతి కోసం ఆమె పోరాటం, నాని జడల్ అనుకోని కారణాల వల్ల జైలుకు వెళ్లడం వంటి సన్నివేశాలతో కథ ముందుకు సాగుతుంది.

జైలు నుంచి బయటకు వచ్చిన జడల్ తన ప్రజల కోసం ఏం చేశాడు అనే కోణం ఆసక్తికరం. శికంజ్ మాలిక్, అతని కొడుకు రాఘవ్ పాత్రలు కథలో సంఘర్షణను క్రియేట్ చేస్తాయి. వారిద్దరితో నానికి ఉన్న వైరం కథలో క్రమంగా పెంచుతూ వెళ్లడం, ఇంటర్వెల్ సీక్వెన్స్ సినిమాపై అంచనాలను పెంచుతుంది. కాకపోతే సెకండాఫ్‌లో కథ పక్కదారి పట్టిన ఫీలింగ్ కలుగుతుంది. స్వయం ప్రతిపత్తి గల ఒక రాజ్యాన్ని ప్రకటించుకోవడం అనే ఆలోచన కాస్త వాస్తవానికి దూరంగా అనిపిస్తుంది. దర్శకుడి ఆలోచన వేరుగా ఉన్నప్పటికీ.. ఆ సన్నివేశాలు ప్రేక్షకుడికి అంత కన్విన్సింగ్‌గా అనిపించవు. అయితే దర్శకుడు కథను యాక్షన్, ఎమోషన్‌తో ముడిపెట్టి నడిపించాడు. ఈ క్రమంలో వచ్చే యాక్షన్ సన్నివేశాలు యాక్షన్‌ను ఇష్టపడే ప్రేక్షకులను అలరిస్తాయి.

### నటీనటుల నటన..

జడల్ పాత్రలో నాని ఒదిగిపోయాడు. ఇంత మాస్ యాక్షన్ క్యారెక్టర్ చేయడం నానికి ఇదే ఫస్ట్ టైం. యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం చాలా కష్టపడ్డాడు. ఆ కష్టం స్క్రీన్‌పై కనిపిస్తుంది. అలాగే తెలంగాణ యాస కూడా నానికి బాగా సెట్ అయింది. సుబ్బు పాత్రలో చేసిన కయాదు లోహార్ రెగ్యులర్ పాత్రలకు కొంచెం భిన్నంగా కనిపించింది. ప్రేమకథలో పెద్ద బలం లేకపోయినప్పటికీ.. సుబ్బు బ్యాక్‌స్టోరీ కాస్త ఆసక్తికరంగా ఉంది. మోహన్ బాబు శికంజ్ మాలిక్‌గా పవర్‌ఫుల్‌గా కనిపించారు. ఆయన స్క్రీన్ ప్రజెన్స్ ఆకట్టుకుంది. బిర్యానీ పాత్రలో సంపూర్ణేష్ బాబు కొత్తగా కనిపించాడు. ఇలాంటి క్యారెక్టర్ చేయడం ఆయనకు నిజంగానే కొత్త. సమ్మక్క గా చేసిన సోనాలి కులకర్ణి ఆ పాత్రను హుందాగా చేసింది. లాయర్ పాత్రలో కనిపించిన సత్యరాజ్, తనికెళ్ల భరణి పాత్రలు పరిధి మేరకు ఉంటాయి.

ఈ సినిమాలో ప్రత్యేకంగా నిలిచిన మరో పాత్ర ఎమ్మెల్యే శంకరన్న. ప్రియదర్శి చేసిన ఈ పాత్ర తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారిని పోలి ఉంటుంది. కేసీఆర్ గారు ప్రెస్‌మీట్స్‌లో మాట్లాడిన మాటలు, ఆయన స్టేట్‌మెంట్స్, డైలాగ్ డెలివరీ, మ్యానరిజమ్స్‌ను పోలి ఉండేలా ప్రియదర్శి పాత్రలో చెప్పిన డైలాగ్స్ థియేటర్లలో ప్రేక్షకులను బాగా అలరించాయి. ఈ క్యారెక్టర్‌కు థియేటర్లలో అద్భుతమయిన రెస్పాన్స్ వచ్చింది.

### టెక్నికల్‌గా..

అనిరుధ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకు పెద్ద ప్లస్. 'ఆయా షేర్', 'ఏష నాగుల కట్ట'.. ఈ రెండు పాటలు కూడా చాలా పెద్ద హిట్ అయ్యాయి. పాటలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. 'ది ప్యారడైజ్' కోసం దర్శకుడు ఒక ప్రత్యేకమైన ప్రపంచాన్ని క్రియేట్ చేశారు. కెమరా వర్క్ రా, రస్టిక్ టోన్ కి పర్ఫెక్ట్ గా ఉంది. ఎడిటింగ్‌లో కొన్ని జంప్స్ కనిపిస్తాయి. సినిమాను చాప్టర్లుగా విభజించారు. అయితే ప్రతి చాప్టర్‌కు మధ్య ఎమోషన్ కొనసాగించడంలో అక్కడక్కడ కొంత తడబాటు కనిపించింది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి.

# రూ.2,490 కోట్లు తగ్గిన షారుఖ్ ఖాన్ సంపద.. అసలు కారణం ఇదే!

బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ ఆస్తికి సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. దేశంలోని ధనవంతుల జాబితాను రూపొందించే 'హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026' తాజాగా ఒక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే షారుఖ్ ఖాన్ ఆస్తి కాస్త తగ్గింది. గతేడాది ఆయన ఆస్తి విలువ రూ. 12,490 కోట్లుగా ఉండగా, ఈ ఏడాది అది రూ. 2,490 కోట్లు తగ్గి రూ. 10,000 కోట్లకు చేరింది. ఆయన వ్యాపారాలు, నిర్మాణ సంస్థ 'రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్', ఐపీఎల్ టీమ్ 'కోల్‌కత్తా నైట్ రైడర్స్' వంటి వాటిని లెక్కలోకి తీసుకుని ఈ అంచనా వేశారు. ఆస్తి కొంత తగ్గినా సరే, భారతదేశంలో అత్యధిక ఆస్తులున్న నటుడిగా షారుఖ్ ఖాన్ మాత్రం తన నెంబర్ వన్ స్థానాన్ని పదిలంగా కాపాడుకున్నారు. ఈ జాబితాలో అమితాబ్ బచ్చన్ రూ. 4,000 కోట్లతో రెండో స్థానంలో ఉండగా, సల్మాన్ ఖాన్ (రూ. 3,000 కోట్లు), హృతిక్ రోషన్ (రూ. 2,500 కోట్లు) తర్వాతి స్థానాల్లో నిలిచారు.



మరోవైపు సినిమాల విషయంలో షారుఖ్ జోరు ఏమాత్రం తగ్గలేదు. ప్రస్తుతం ఆయన సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ సినిమా 'కింగ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా డిసెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# రూ.100 కోట్లకు 'మాన్‌స్టర్' థియేట్రికల్ రైట్స్ ..

## సల్మాన్ ఖాన్ సినిమాకి భారీ బిజినెస్ టాక్



బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్, లేడీ సూపర్‌స్టార్ నయనతార కలిసి నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'మాన్‌స్టర్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి వంశీ పైడిపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో శరవేగంగా కొనసాగుతోంది. సల్మాన్ ఖాన్, నయనతార కాంబినేషన్‌తో పాటు దర్శకుడు వంశీ పైడిపల్లి, నిర్మాత దిల్ రాజు కలిసి చేస్తున్న సినిమా కావడంతో బాలీవుడ్, దక్షిణాది ప్రేక్షకుల్లోనూ ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి పెరుగుతోంది. ప్రస్తుతం ముంబైలో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్న చిత్రబృందం.. అక్టోబర్‌లో విదేశాల్లో మరో షెడ్యూల్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. కథకు కీలకంగా నిలిచే యాక్షన్ సన్నివేశాలతో పాటు విదేశీ లొకేషన్లలో కొన్ని ముఖ్యమైన సన్నివేశాలను తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. సల్మాన్ ఖాన్, నయనతార ప్రధాన పాత్రల్లో కనిపించనున్న ఈ చిత్రంలో పలువురు ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అరవింద్ స్వామి, రోనిత్ రాయ్, సీమా బిస్వాస్ తదితరులు ఈ ప్రాజెక్టులో భాగమయ్యారు. దీంతో సినిమాకు బాలీవుడ్ స్థాయిలోనే కాకుండా దక్షిణాది ప్రేక్షకులను ఆకట్టుకునేలా భారీ తారాగణం సిద్ధమవుతోంది. దిల్ రాజు నిర్మాణ సంస్థ నుంచి వస్తున్న ఈ చిత్రం.. ఆయన, సల్మాన్ ఖాన్ కలయికలో తెరకెక్కుతున్న తొలి సినిమా కావడం కూడా ప్రత్యేకతగా మారింది. వంశీ పైడిపల్లి గతంలో భారీ స్థాయి చిత్రాలను తెరకెక్కించిన అనుభవం ఉండటంతో ఈ ప్రాజెక్టును కూడా అత్యంత భారీగా రూపొందిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఇక 'మాన్‌స్టర్' సినిమాకు సంబంధించిన బిజినెస్ వ్యవహారాలపై తాజాగా ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమా దేశవ్యాప్త థియేట్రికల్ హక్కులను ప్రముఖ మల్టీప్లెక్స్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ సుమారు రూ.100 కోట్లకు దక్కించుకున్నట్లు సినీ వ్యాపార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ఒప్పందం రిఫండబుల్ అడ్వాన్స్ విధానంలో కుదిరినట్లు కూడా సమాచారం. అంటే సినిమా విడుదలకు ముందే భారీ మొత్తంలో బిజినెస్ జరగడం ద్వారా ప్రాజెక్టుపై ఉన్న మార్కెట్ అంచనాలు ఎంత స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోందని ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈ రూ.100 కోట్ల ఒప్పందానికి సంబంధించి నిర్మాత దిల్ రాజు, చిత్రబృందం లేదా పీవీఆర్ ఐనాక్స్ సంస్థ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. అందువల్ల ప్రస్తుతం వినిపిస్తున్న ఈ బిజినెస్ వార్తను అధికారికంగా నిర్ధారించబడిన విషయంగా కాకుండా పరిశ్రమ వర్గాల్లో జరుగుతున్న ప్రచారంగానే చూడాలి. 'మాన్‌స్టర్'ను 2027 ఈద్ సందర్భంగా ప్రేక్షకులముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

# 64 ఏళ్ల వయసులోనూ అదిరిపోయే స్టంట్స్..



### అర్జున్ సర్జా ఫిట్‌నెస్ సీక్రెట్ ఇదేనా?

దక్షిణాది సినీ పరిశ్రమలో 'యాక్షన్ కింగ్'గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ సర్జా ఇప్పటికీ తన ఫిట్‌నెస్‌తో అభిమానులను ఆశ్చర్యపరుస్తూనే ఉన్నారు. 64 ఏళ్ల వయసులోనూ యువకుడిలా కఠినమైన యాక్షన్ విన్యాసాలు చేయగల ఆయన సామర్థ్యానికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.తాజాగా వైరల్ అవుతున్న వీడియోలో అర్జున్ సర్జా ఎంతో సులభంగా గాల్లోకి కాలు ఎత్తి, కరాటే విన్యాసంతో బాటిల్ మూతను ఎగరగొట్టారు. ఈ స్టంట్‌లో ఆయన చూపించిన వేగం, శరీర సౌష్టవం, కాళ్ల ఫ్లెక్సిబిలిటీ చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. వయసు 64కు చేరినా ఆయనలోని చురుకుదనం ఏమాత్రం తగ్గలేదంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.అర్జున్ సర్జా ఫిట్‌నెస్‌కు ప్రధాన కారణాల్లో మార్షల్ ఆర్ట్స్ సాధన ఒకటిగా చెప్పొచ్చు. చిన్నతనం నుంచే మార్షల్ ఆర్ట్స్‌పై ఆసక్తి పెంచుకున్న ఆయన.. ఇప్పటికీ కరాటే, కిక్ బాక్సింగ్ వంటి శిక్షణను కొనసాగిస్తున్నట్లు గతంలో పలుమార్లు వెల్లడించారు. శరీరాన్ని చురుకుగా ఉంచేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో పాటు యోగా, స్ట్రెచింగ్ వంటి సాధనలకు కూడా ప్రాధాన్యత ఇస్తారని సమాచారం. కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, సమతుల్యమైన ఆహారపు అలవాట్లు కూడా తన ఫిట్‌నెస్‌లో కీలక పాత్ర పోషిస్తున్నాయని అర్జున్ సర్జా గతంలో చెప్పిన సందర్భాలున్నాయి. వయసు పెరిగే కొద్దీ శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవాలంటే నిరంతర సాధన, క్రమశిక్షణ అవసరమనే విషయాన్ని ఆయన జీవనశైలి చూపిస్తోంది.

అర్జున్ సర్జా సినీ ప్రస్థానం విషయానికి వస్తే.. తెలుగులో ఆయన నటించిన తొలి చిత్రంగా 'మా పల్లెలో గోపాలుడు' (1985) నిలిచింది. ఆ తర్వాత తెలుగు, తమిళ చిత్రాల్లో వరుస అవకాశాలు అందుకుంటూ దక్షిణాదిలో యాక్షన్ హీరోగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. 'జెంటిల్‌మెన్', 'ఒకే ఒక్కడు', 'హనుమాన్ జంక్షన్', 'ప్రసాద్', 'పుట్టింటికి రా చెల్లి' వంటి సినిమాలు ఆయనకు తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపును తీసుకొచ్చాయి.

# మిక్స్‌డ్ రీలేలో రజతం..

**మారథాన్‌లో సీమకు చరిత్రాత్మక కాంస్యం..!**

ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. ఐదో రోజు షూటర్లు వెండి వెలుగులు విరజిమ్మగా.. అథ్లెట్లు కూడా పోడియంపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. పది వేల మీటర్ల పరుగులో సీమా కుమారి కంచు మోత మోగించింది. సీమ కాంస్యం అందుకున్న ఇరవై నిమిషాల్లోనే మిక్స్‌డ్ రీలే(4ఐ400 మీటర్ల) ఫైనల్లో భారత బృందం రజతం ఒడిసిపట్టింది. ఫలితంగా భారత్ ఖాతాలో 17 పతకాలు చేరాయి.

జపాన్‌లోని నగోయలో జరుగుతున్న పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు పతకపోరులో దూసుకెళ్తున్నారు. మిక్స్‌డ్ రీలే (4ఐ400 మీటర్ల) విభాగంలో . మిక్స్‌డ్ విభాగం ఫైనల్లో పూవమ్మ రాజు, విశాల్ థెన్నరసు, విథ్యా రామరాజు, మను టీఎస్‌లు రెండో స్థానంతో రజతం గెలుపొందారు. గురువారం ఫైనల్లో.. విథ్యా, విశాల్ చిరుతలా పరుగెత్తారు. వీరి కృషి ఫలితంగా ఈ టోర్నీలో తమ రికార్డును కాపాడుకుంది మిక్స్‌డ్ రీలే బృందం. ఇదివరకు 2018లో స్వర్ణం, 2022 ఎడిషన్‌లో భారత టీమ్ రజతం గెలుపొందింది.

అంతకుముందు.. మహిళల 10 వేల మీటర్ల పరుగులో సీమా కుమారి సత్తా చాటింది. ఈ మారథాన్ రేసులో 16 ఏళ్లుగా పతకం కోసం నిరీక్షిస్తున్న భారత్‌ను



సంబురాల్లో ముంచెత్తింది. ఫైనల్లో 32:50:05 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకొని కాంస్య పతకాన్ని ముద్దాడిందీ హిమాచల్ ప్రదేశ్ అథ్లెట్. ఆమె మూడో స్థానానికి పరిమితమవ్వగా.. విన్‌ఫ్రెడ్ యవీ(బహ్రెయిన్) పసిడి, నొజొమి(జపాన్) వెండి పతకాలు సాధించారు.కామన్వెల్త్ క్రీడల్లో విఫలమైన భారత చిరుత గురిందెర్వీర్ సింగ్ ఈసారి అంచనాలు అందుకున్నాడు. పురుషుల 100 మీటర్ల పరుగులో అతడితో పాటు ఇండియన్ బోల్ట్ అనిమేశ్ కుజుర్ సెమీస్‌కు దూసుకెళ్లాడు. పురుషుల కబడ్డీలో భారత జట్టు దర్జాగా సెమీస్ చేరింది. క్వార్టర్స్‌లో తో చైనీస్ తైపీని ఇండియా చిత్తు చేసింది.

## దిల్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్.. కొరియాపై భారత్ విక్టరీ

టోక్యో: ఆసియా క్రీడల హాకీ ఈవెంట్‌లో ఇండియా దుమ్మురేపుతోంది. పూల్ ఏ నుంచి భారత జట్టు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఇవాళ దక్షిణ కొరియాతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా 8-2 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత స్ట్రయికర్ దిల్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్ గోల్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దిల్‌ప్రీత్‌తో పాటు అభిషేక్, శిలానంద్ లక్రా, సుఖ్‌జీత్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్, రాజిందర్ సింగ్ కూడా గోల్స్ చేశారు. ఆసియా గేమ్స్ చరిత్రలోనే తొలిసారి దక్షిణ కొరియాపై ఇండియా భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో ఇండియా పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ విక్టరీతో ప్రస్తుతం పూల్ ఏ స్టాండింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. శనివారం జరిగే మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు జపాన్‌తో భారత్ తలపడనున్నది.



# పాకిస్థాన్‌తో ఆఖరి ఓవర్ థ్రిల్లర్..

### ఆ ఉద్విగ్న క్షణాలకు 19 ఏళ్లు..!

పురుషుల టీ20 ప్రపంచకప్‌ను ఒకటి కాదు ఏకంగా మూడు సార్లు ముద్దాడింది భారత జట్టు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకోవడం చిన్న విషయమేమీ కాదు. కానీ, అప్పుడప్పుడే పొట్టి క్రికెట్ వైపు అడుగులు పడుతున్న వేళ 'మెన్ ఇన్ బ్లూ' తొలిసారి ఈ ఐసీసీ ట్రోఫీని అందుకున్న క్షణాలు ఎప్పటికీ చిరస్మరణీయమే. తొలిసారి నిర్వహించిన ఈ మెగా టోర్నీలో జులపాల ఎంఎస్ ధోనీ (మీా ఐష్ట్రశీఅఱ) సారథ్యంలోని టీమిండియా అబ్బురపరిచే ఆటతో కప్‌ను ఒడిసిపట్టింది. అది కూడా ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో పాకిస్థాన్‌ను ఓడించి. టీమిండియా, ధోనీ ఘనతల్లో కలకాలం నిలిచిపోయిన ఈ మొట్టమొదటి పొట్టి వరల్డ్‌కప్ విజయానికి సరిగ్గా నేటితో 26 ఏళ్లు. క్రికెట్‌లో ఇప్పుడు టీ20లదే హవా. బ్యాటర్ల వీరకొట్టుడు, ఉత్కంఠ పోరాటాలు, ఆఖరి ఓవర్ థ్రిల్లర్.. అబ్బో ఈ ఆట ఇచ్చే కిక్కే వేరు. అయితే.. 2007లోనే క్రికెట్ ప్రియులకు అసలు సిసలైన టీ20 మజాను పంచింది టీమిండియా. ఆ ఏడాది ఐసీసీ తొలిసారిగా ప్రవేశపెట్టిన పొట్టి వరల్డ్‌కప్‌ను సంచలన ఆటతో లేని ధోనీ సారథ్యంలోని భారత జట్టు గెలుపొందింది. సెమీస్‌కు ముందు ఇంగ్లండ్‌పై యువరాజ్ సింగ్ ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లతో చరిత్ర సృష్టించగా.. పాకిస్థాన్‌తో ఫైనల్ మరింత థ్రిల్‌నిచ్చింది. నరాలు తెగే ఉత్కంఠ రేపిన ఫైనల్లో జోగిందర్ శర్మ వేసిన ఆఖరి ఓవర్‌ను, శ్రీశాంత్ పట్టిన సూపర్ క్యాచ్‌ను భారత అభిమానులు ఎప్పటికీ మర్చిపోలేరు.



### ఫైన్ లెగ్‌లో క్యాచ్

సెప్టెంబర్ 24న జరిగిన ఫైనల్లో భారత్ నిర్దేశించిన 158 పరుగుల ఛేదనలో పాకిస్థాన్ 152కే పరిమితమైంది. సహచరులు విఫలమైనా.. క్రీజునంటుకున్న మిస్బాహుల్ హక్ (43) సిక్సర్లతో విరుచుకుపడి భారత అభిమానుల్లో గుబులు రేపాడు. కానీ, ఒత్తిడికి తలొగ్గే అలవాటున్న పాక్ ధోనీ తెలివి ముందు ఓటమిని తప్పించుకోలేకపోయింది. జోగిందర్ సూపర్ బౌలింగ్.. శ్రీశాంత్ అద్భుత క్యాచ్ తోడయ్యాయి. అంతే.. సులువగా గెలుస్తుందనుకున్న దాయాది జట్టు మిస్బా తప్పుడు షాట్‌తో చతికిలపడింది. అంతే.. 1983లో 'కపిల్ డెవిల్స్' దేశానికి తొలి వన్డే వరల్డ్‌కప్ గెలుపొందిన రోజున భారతీయులు ఎంతగా సంబురాలు చేసుకున్నారో.. ధోనీ సేన టీ20ల్లో జగజ్జేతగా నిలిచిన రోజున అంతకుమించి సంబురాల్లో గడిపారు. ఫైన్ లెగ్‌లో మిస్బా ఆడిన బంతిని శ్రీశాంత్ అందుకోవడంతో భారత డగౌట్‌లో సంబురాలు మొదలయ్యాయి. టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించిన జోగిందర్‌కు హర్యానా ప్రభుత్వం పోలీస్ జాబ్ ఇవ్వగా.. ప్రస్తుతం అతడు డీఎస్పీ హోదాలో ఉన్నాడు.

# డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలతపై దాడి..

**చంపుతామంటూ బెదిరింపులు!**

తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డాన్సర్స్ అండ్ డాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అసోసియేషన్ అధ్యక్షురాలు వి.వి. సుమలతా దేవిపై కొంతమంది దుండగులు భౌతిక దాడికి పాల్పడటం ఇండస్ట్రీలో కలకలం రేపింది. ఇందిరానగర్‌లోని రాఘవ గెస్ట్ హౌస్‌లో అత్యంత కీలకమైన జనరల్ బాడీ సమావేశం జరుగుతున్న సమయంలో ఈ అవాంఛనీయ ఘటన వెలుగు చూసింది. సమావేశం సజావుగా సాగుతున్న సమయంలో కొందరు వ్యక్తులు ముందస్తు ప్లాన్‌తో సమావేశాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారని, ఆపై తనపై భౌతిక దాడికి దిగారని సుమలత ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం దాడితో ఆగకుండా, అసోసియేషన్‌కు సంబంధించిన అత్యంత ముఖ్యమైన రికార్డులను బలవంతంగా, అక్రమంగా ఎత్తుకెళ్లడానికి వారు ప్రయత్నించారని ఆమె పోలీసులకు తెలిపారు. అంతేకాకుండా, తాను వెంటనే అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని, లేదంటే ప్రాణాలతో ఉండనివ్వమని తీవ్రంగా హెచ్చరిస్తూ బెదిరింపులకు పాల్పడ్డారని వాపోయారు.




ఈ అనూహ్య పరిణామాలు, ప్రాణహాని హెచ్చరికలతో బెంబేలెత్తిపోయిన సుమలతా దేవి వెంటనే బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి రాతపూర్వక ఫిర్యాదు అందజేశారు. తనకు మరియు తన కుటుంబ సభ్యులకు ప్రాణ రక్షణ కల్పించాలని ఆమె పోలీసులను అభ్యర్థించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి నిజానిజాలు వెలుగులోకి రావాలంటే, రాఘవ గెస్ట్ హౌస్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

## తొలి వన్డేలో సఫారీల గెలుపు



దర్బన్ : దక్షిణాఫ్రికా పర్యటనను ఆస్ట్రేలియా ఓటమితో ఆరంభించింది. దర్బన్ వేదికగా ఇరుజట్ల మధ్య జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య సఫారీ జట్టు.. 67 పరుగుల తేడాతో కంగారూలను ఓడించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత ఓవర్లలో 297/8 స్కోరు చేసింది.మాథ్యూ బ్రీట్జె (112) శతకంతో రెచ్చిపోగా ఆఖర్లో మార్కో యాన్సెన్ (75) మెరుపులు మెరిపించాడు. ఛేదనలో ఆసీస్ 41.2 ఓవర్లకు 230 రన్స్‌కే కుప్పకూలింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (60), మాథ్యూ రెన్‌షా (44) పోరాడారు.

## హసరంగ మళ్లీ దూరం.. వన్డే సిరీస్‌లో శ్రీలంక నిలబడేనా..!



ఇంగ్లండ్ పర్యటనలో తేలిపోతున్న శ్రీలంకకు మరో షాక్. అసలే.. టీ20 సిరీస్‌లో వైట్‌వాష్‌కు లోనైన బాధ నుంచి తేరుకోక ముందే.. ఆ జట్టు స్టార్ స్పిన్నర్ వనిందు హసరంగ వన్డేలకు దూరమయ్యాడు. మూడు వన్డేల సిరీస్‌కు ముందే కారణంగా ఈ సీనియర్ ఆల్‌రౌండర్ స్వదేశానికి రానున్నాడు. ఈ విషయాన్ని గురువారం లంక క్రికెట్ వెల్లడించింది.శ్రీలంక స్పిన్ అస్త్రంగా పేరొందిన వనిందు హసరంగ మరో ద్వైపాక్షిక సిరీస్‌కు దూరమయ్యాడు. ఇటీవల కాలంలో తరచూ గాయాలతో జట్టుకు దూరమవుతున్న ఈ మిస్టరీ బౌలర్ .. ఈసారి కూడా రిహాబిలిటేషన్‌లో ఉండనున్నాడు. ఇంగ్లండ్ పర్యటనలో తొలి వన్డేకు ముందు నెట్స్‌లో హసరంగ ఇబ్బందిపడడమే అందుకు కారణం. బౌలింగ్ చేస్తుండగా.. వెన్ను కింది భాగంలో నొప్పి మొదలైంది. దాంతో అతడు తొలి వన్డే ఆడలేదు. అనంతరం పరీక్షలు నిర్వహించగా.. వైద్యులు విశ్రాంతి సూచించారు. దాంతో.. వన్డే సిరీస్ మొత్తం హసరంగ అందుబాటులో ఉండదని లంక క్రికెట్ తెలిపింది.మూడేళ్ల క్రితం వన్డే వరల్డ్‌కప్‌లో గాయపడిన హసరంగ.. అప్పటి నుంచి ఆడింది కొన్ని మ్యాచ్‌లే. ప్రపంచకప్ లీగ్ దశ ఐర్లాండ్‌పై మూడు వికెట్లతో మెరిసిన హసరంగ.. గాయంతో టోర్నీ నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. ఇంగ్లండ్‌తో లీడ్స్‌లో జరుగుతున్న తొలి వన్డేలో కెప్టెన్ కుశాల్ మెండిస్(121) శతకంతో.. లంక 6 వికెట్ల నష్టానికి 321 పరుగులు చేసింది.

## అండర్-15 ఆసియాకప్ పోటీలకు వరంగల్ క్రీడాకారిణి ఎంపిక



అండర్-15 ఆసియాకప్ పోటీల్లో ఇండియన్ సాఫ్ట్‌బాల్ జట్టులో ఆడేందుకు వరంగల్ క్రీడాకారిణి వేల్పుల సాయివర్షిని ఎంపిక అయ్యింది. చైనాలో అక్టోబర్ 12 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న 5వ అండర్-15 ఉమెన్స్?? సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆమె పాల్గొననుందని హనుమకొండ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ తాబేటి రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ శ్వేతను మర్యాదపూర్వకంగా కలవడంతో ఆమె క్రీడాకారిణిని అభినందించారు. సీపీ మాట్లాడుతూ ఇండియన్ టీంకు సాయివర్షిని ఎంపిక కావడం అభినందనీయమని కొనియాడారు. సాయివర్షినినీ క్రీడాకారిణిగా ఎదిగేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, కోచ్ పోలేపాక వినయ్ , సాయివర్షిని తండ్రి అనిల్, అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్ ఉన్నారు.

## బీసీసీఐతో దోస్తీ.. టీమిండియా టైటిల్ స్పాన్సర్‌గా 'ముత్తూట్ ఫిన్‌కార్ప్'..!




ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ పంట పండనుంది. బంగారంపై రుణాలతో అందరికీ చేరువైన ఈ సంస్థ భారత క్రికెట్ నియంత్రణ మండలితో దోస్తీకి సిద్ధమైంది. పలు సంస్థలను వెనక్కి నెట్టి భారత జట్టు టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులు దక్కించుకుందీ సంస్థ. వచ్చే రెండేళ్ల పాటు టీమిండియా జెర్సీలపై ముత్తూట్ పేరు తళుక్కుమననుంది. 'బ్లూ ముత్తూట్' (దీశ్రీబవ వీబ్‌ష్ట్రశీశీ) పేరుతో టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించనుందీ కంపెనీ. అయితే.. స్వదేశంలో టీమిండియా ఆడే మ్యాచ్‌లకు మాత్రమే పరిమితం కానుందని సమాచారం.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609